

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

గురువారం 5 మార్చి 2026 12 పేజీలు


# కరీంనగర్ వీధుల్లో హాలీం హంగామా

- రంజాన్ రుచుల్లో ముందంజలో హాలీం
- ఇఫ్తార్ సమయానికి హాలీం కౌంటర్ల వద్ద జనం రద్దీ
- డ్రైఫ్రూట్స్‌తో ప్రత్యేక హాలీం తయారీ
- యువతలో హాలీం క్రేజ్ పెరుగుతోంది
- తాత్కాలిక స్టాళ్లతో కళకళలాడుతున్న మార్కెట్ ప్రాంతాలు
- హాలీం అమ్మకాలతో ఊపందుకున్న స్థానిక వ్యాపారం



**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కావడంతో కరీంనగర్ పట్టణం హాలీం వాసనతో పరిమళిస్తోంది. సాయంత్రం అజాన్ మోగిన వెంటనే ఇఫ్తార్ సమయానికి ముస్లిం సోదరులు ఉపవాస విరమణ చేసేందుకు సిద్ధమవుతుంటే, నగరంలోని ప్రధాన వీధుల్లో హాలీం కౌంటర్లు సందడిగా మారుతున్నాయి. హైదరాబాద్ తర్వాత హాలీంకు ప్రత్యేక గుర్తింపు ఉన్న పట్టణాల్లో కరీంనగర్ కూడా ఒకటిగా నిలుస్తోంది.పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో తాత్కాలిక స్టాళ్లు ఏర్పడి వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ప్రత్యేకంగా మటన్ హాలీం, చికెన్ హాలీం, స్పెషల్ డ్రైఫ్రూట్స్ హాలీం వంటివి ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. 2లో






## చెల్లి వరుస మైనర్ బాలికకు ప్రేమ పేరుతో అన్న వేధింపులు

**- ఆత్మహత్యయత్నం చేసి చికిత్స పొందుతూ బాలిక మృతి**



**సూర్య జగిత్యాల ప్రతినిధి**

జగిత్యాల జిల్లాలో మైనర్ బాలికపై దారుణం జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వరుసకు చెల్లితో ప్రేమాయణం పేరుతో కోరిక తీర్చాలని ఒత్తిడి తెచ్చిన మనోజ్ కుమార్ అనే వ్యక్తి నిరంతరం వేధింపులకు గురి చేస్తూ బలవంతంగా శారీరక దాడికి పాల్పడ్డాడు. విషయం బయటపెడితే తమ్ముడిని చంపేస్తానని బెదిరించడంతో భయాందోళనకు గురైన బాలిక, ఏమి చేయాలో అర్థంకాక వారం క్రితం సూసైడ్ నోట్ రాసి పురుగుల (మిగతా 2లో)

## విద్యార్థులతో కలిసి.. భోజనం చేసి...

**- కేజీబీవీ విద్యార్థులతో భోజనం చేసిన కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- బోయినపల్లి కేజీబీవీ ఆకస్మిక తనిఖీ**

**సూర్య బోయినపల్లి..**

బోయినపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ను కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్, వంట గది, బియ్యం, పప్పులు, గుడ్లు ఇతర ఆహార పదార్థాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయం కావడంతో మెనూ పరిశీలించి.. కలెక్టర్ ప్లేట్ తీసుకొని భోజనం తీసుకుని విద్యార్థులతో కలిసి కింద కూర్చొని తిన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అని ఆరా





తీశారు. ఈ రోజు తింటున్న ఆహారంలో విటమిన్లు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేడ్స్ ఏమి ఉన్నాయో ప్రశ్నించారు? రోజూ ఎంత పరిమాణంలో తీసుకోవాలి.. విద్యార్థులు వార్షిక పరీక్షలకు ఎలా సిద్ధం అవుతున్నారని ప్రశ్నించారు? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. అనంతరం విద్యాలయం పై అంతస్తులో నిర్మిస్తున్న గదులు, టాయిలెట్లు ఇతర పనులపై ఉపాధ్యాయుల నుంచి కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు.పదో తరగతి, ఇతర తరగతుల విద్యార్థులు ప్రతి సబ్జెక్ట్ కు సంబంధించి అన్ని పాఠాలు చదవాలి.. రాయాలి అని సూచించారు. సమయాన్ని (మిగతా 2లో)

## యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు



**- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**సూర్య మంథని**

యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. మంథనిలోని గంగపురి ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని, గౌతమి (మిగతా 2లో)

# కరీంనగర్ వీధుల్లో హలీం హంగామా

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

**- సాంప్రదాయం - రుచికి ప్రతీక**

హలీం అనేది గోధుమలు, మటన్, పప్పులు, నెయ్యి, మసాలాలు సమపాళ్లలో కలిపి గంటల తరబడి మగ్గించి తయారు చేసే ప్రత్యేక వంటకం. మగ్గించే విధానమే దీనికి ప్రత్యేక రుచి తెస్తుంది. రోజుకు వేల కిలోల హలీం నగరంలో విక్రయమవుతోందని వ్యాపారులు చెబుతున్నారు. ఈసారి కిలో ధర రూ.800 నుంచి రూ.1200 వరకు ఉండగా, హాఫ్ కేజీ, క్వార్టర్ ప్యాకెట్లు కూడా అందుబాటులో ఉంచుతున్నారు.

**- కుటుంబాలతో కలిసి హలీం రుచి**



సాయంత్రం వేళ కుటుంబాలతో కలిసి హలీం కొనుగోలు చేయడం ఒక ఆనవాయితీగా మారింది. యువత సెల్ఫీలు తీసుకుంటూ సోషల్ మీడియాలో షేర్ చేస్తుండగా, పెద్దలు సాంప్రదాయ రుచిని ఆస్వాదిస్తున్నారు. ఇతర మతాల ప్రజలు కూడా హలీం రుచి చూడటానికి ఆసక్తి చూపుతున్నారు.

**- పోలీసుల పర్యవేక్షణ- పారిశుద్ధ్య చర్యలు**

రంజాన్ సందర్భంగా ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.



ఫుడ్ సేఫ్టీ అధికారులు స్టాళ్లను తనిఖీ చేసి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచిస్తున్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలంటూ మున్సిపల్ అధికారులు వ్యాపారులకు మార్గదర్శకాలు జారీ చేశారు.



**- ఆర్థికంగా ఊపిరి పీల్చుకున్న వ్యాపారులు**

రంజాన్ నెల వ్యాపారులకు మంచి ఆదాయం తెచ్చిపెడుతోంది. కొంతమంది తాత్కాలికంగా ఉద్యోగాలు కూడా పొందుతున్నారు. రోజువారీ కూలీలు, వంట కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరిగాయి. మొత్తంగా కరీంనగర్ పట్టణం రంజాన్ ఆత్మీయతతో పాటు హలీం రుచులతో కళకళలాడుతోంది. పండుగ ముగిసే వరకు ఈ హలీం సందడి కొనసాగనుంది.

## సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకండి

**- ఎస్ఐ తిరుపతి**

**- వీణవంకలో 'సైబర్ జాగ్రత్త దివస్' అవగాహన సదస్సు**

**సూర్య, వీణవంక**



సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి సూచించారు. "సైబర్ జాగ్రత్త దివస్" కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో బుధవారం ప్రజలకు, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ?ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తక్కువ ధరకే విహారయాత్రలు, హోటల్ బుకింగ్స్ అంటూ వచ్చే నకిలీ లింకులను నమ్మవద్దని, కేవలం అధికారిక వెబ్‌సైట్ల ద్వారానే బుకింగ్స్ చేసుకోవాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో సెల్ టవర్లు ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ పథకాలు ఇప్పిస్తామని నమ్మబలికి, ముందస్తు ఫీజుల పేరుతో డబ్బులు వసూలు చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. బ్యాంక్ అధికారులమంటూ ఫోన్ చేసి ఓటిపి, పిన్ నంబర్లు అడిగితే చెప్పకూడదని, అసలు బ్యాంక్ వారు ఎప్పుడూ వ్యక్తిగత వివరాలు అడగరని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వేధింపులకు గురైనా, ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని కోరారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని, నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రఘుపతి రెడ్డి, సురేష్‌తో పాటు విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన హోళీ సంబరాలు

**సూర్య, వీణవంక**

హోళీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని వీణవంక మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో యువతి, యువకులు హోళీ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. చిన్న, పెద్ద బేధం లేకుండా ఒకరికొకరు రంగులు పూసుకుంటూ హోళీ సంబరాలను జరుపుకుంటూ ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రతి ఒక్కరి జీవితం రంగులమయంగా విరజిల్లడంతో పాటు కోరుకున్న కోరికలు నెరవేస్తూ ప్రతి కుటుంబం ఆనందోత్సవాల మధ్య సంతోషంగా, పండుగల జరుపుకోవాలని పలువురు కోరారు. రోడ్లపైకి వచ్చి హోళీ సంబరాలు జరుపుకుంటూ అందరికి హోళీ శుభాకాంక్షలు తెలియజేశారు.





## లక్ష్య సాధనకు నిరంతర శ్రమ అవసరం

**- డాక్టర్ స్వరూప రాణి**

**సూర్య, హుజురాబాద్**

మహిళలు, బాలికలు తమ లక్ష్య సాధన కోసం నిరంతర శ్రమ అవసరమని, ఆటుపోట్లను ఎదురుకున్నప్పుడే విజయం మన సొంతమవుతుందని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి. స్వరూప రాణి అన్నారు. బుధవారం హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికలకు ఉన్నత లక్ష్యాలకు చేరిన మహిళలతో ముఖాముఖి జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సమాజంలో ఎదురవుతున్న అడ్డంకులను ఎదుర్కోవాలని, మానసిక ధైర్యం ఉంటే వేటినైనా సాధించుకోవచ్చని అన్నారు. తనకు 16 సంవత్సరాల వయసులో 8వ తరగతిలో వివాహం జరిగిందని, కానీ వివాహమైనప్పటికి చదువును కొనసాగించానని అన్నారు. ఎస్.ఎస్.సి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి భర్త ప్రోత్సాహంతో బిఈడి చేశానని అన్నారు. డీఎస్సీ ద్వారా టీచరుగా ఎంపికైన తాను అంతటితో ఆగకుండా ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికి కష్టపడి పీజీ, పి.హెచ్.డి చేశానని, తర్వాత డిగ్రీ కళాశాల లెక్చరర్ గా ఉద్యోగం పొందానని, ప్రస్తుతం అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్ననని అన్నారు. ప్రస్తుత సమాజంలో బాలికలు ఎదగడానికి ఎన్నో అవరోధాలు వస్తాయని, వాటిని ఓపికగా ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు. విద్యార్థి దశలో ఉన్న బాలికలు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తే విజయం మనదేనని అన్నారు. అనంతరం పాఠశాల హెచ్ఎం శోభారాణి మాట్లాడుతూ... కష్టపడి ఉన్నత శిఖరాలకు ఎదిగిన స్వరూప రాణి అలాంటి వారిని బాలికల ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. సుఖం ఊరికనే రాదని, ఎన్నో కష్టాలు, బాధలు పడితే వస్తుందన్నారు. ఈ సందర్భంగా స్వరూప రాణి ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగమణి, రాజ్యలక్ష్మి, మాధవి, అనిత, రజిత, అంజలి, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉద్యోగి రాజిరెడ్డికి సన్మానం

**సూర్య, హుజురాబాద్**



నేషనల్ లైన్ మెన్స్‌డే ను పురస్కరించుకొని బుధవారం హుజురాబాద్ పట్టణంలోని ట్రాన్స్ కో సబ్ స్టేషన్ లో ప్రజలకు ఉత్తమ సేవలందిస్తున్న లైన్ మెన్ రాజిరెడ్డి ని ట్రాన్స్ కో డిడి ఈఈ లక్ష్మారెడ్డి ప్రశంసా పత్రం అందజేసి శాలువాతో సత్కరించారు. ట్రాన్స్ కో శాఖలో ఉత్తమ సేవలందిస్తున్నందుకు గాను రాజిరెడ్డిని సత్కరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ట్రాన్స్ కో రూరల్ ఏఈ రమేష్, ఆంజనేయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## చెల్లి వరుస మైనర్ బాలికకు ప్రేమ పేరుతో అన్న వేధింపులు

(మొదటి పేజి తరువాయి)

మందు తాగి అత్మహత్య యత్నం చేసింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాదు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. బాలికది ధర్మపురి మండలం నరసయ్యపల్లి గ్రామం కాగా ప్రస్తుతం జగిత్యాలలో ఉంటూ ఇంటర్ చదువుకుంటోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు

(మొదటి పేజి తరువాయి)

నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, టాస్క్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వం 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ లో భాగంగా టీజిఐఐసి సంస్థ ఆధ్వర్యంలో గార్మెంట్ యూనిట్ల ఏర్పాటు కోసం రెండు ఎకరాలు భూమి కేటాయించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.టాస్క్ సెంటర్ ద్వారా యువతకు మంచి శిక్షణ అందించేందుకు వీలుగా మంథని లో సెంటర్ ఏర్పాటు చేశామని, అవసరమైన పక్షంలో మరో భవనానికి కూడా విస్తరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మంథని ఆర్డీవో సురేష్, తహసిల్దార్ ఆరిఫోద్దీన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో కలిసి.. భోజనం చేసి...

(మొదటి పేజి తరువాయి)

సద్వినియోగం చేసుకోవాలని, లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు వెళ్లాలని పిలుపు ఇచ్చారు. ఉద్యోగం లేదా వృత్తిలో స్థిరపడిన తర్వాత మిగతా విషయాలు ఆలోచించాలని దిశానిర్దేశం చేశారు.



## పదవ తరగతి విద్యార్థులకు 'సరస్వతి కటాక్ష' పెన్నుల పంపిణీ

**సూర్య, వీణవంక**

విద్యార్థులు లక్ష్య సాధనలో పట్టుదలతో ముందుకు సాగాలని, రాబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని సామాజిక కార్యకర్త, యోగా మాస్టర్ దేవనూరి శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాది జక్కుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ?తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో, శ్రీ సురేష్ ఆత్మారామ్ మహరాజ్ గారి స్ఫూర్తితో.. "సోల్జర్‌కు గన్ను - స్టూడెంట్‌కు పెన్ను" అనే వినూత్న నినాదంతో వీణవంక మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పెన్నుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మామిడాలపల్లి, ఎలబాక, గంగారం, ఘన్ముకుల, పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలలో జరగగా, యాదవ చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల శ్రీనివాస్, దేవనూరి శ్రీనివాస్ లు విద్యార్థులకు పెన్నులను అందజేశారు. పరీక్షల పట్ల భయం వీడి, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ?ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి శోభారాణి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా నిలుస్తున్న తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థను, దేవనూరి శ్రీనివాస్ ని వారు ఈ సందర్భంగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

**సూర్య కరీంనగర్**

కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నగునూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు నగునూరు గ్రామ శివారు కి వెళ్లి తనికి చేయగా నగునూరు గ్రామానికి చెందిన ఆళ్లకుంట అంజయ్య, సూర శ్రీను, అల్లేపు రవి, కొంచెం రఘు, సూర రాజేందర్ అనువారు మూడుముక్కలాట ఆడుచుండగా పట్టుబడినారు.అట్టి వ్యక్తుల వద్ద నుండి 15,500/- నగదును, పేకాట ముక్కలను సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపనైనది అని సిఐ ఏ నిరంజన్ రెడ్డి తెలిపారు.



నేటి దినపత్రిక

సూర్య

www.suryaa.com

రాజన్నసిరిసిల్ల

గురువారం 5 మార్చి 2026



# విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**- తహసిల్దార్ పుష్పలత - కేజీబీవీని తనిఖీ చేసిన తహసిల్దార్**

**సూర్య రుద్రంగి**



విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, అన్ని వసతులు కల్పించాలని రుద్రంగి తహసిల్దార్ పుష్పలత అన్నారు. బుధవారం రుద్రంగి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అనారోగ్య సమస్యలతో కొందరు విద్యార్థులు అస్వస్థతకు గురి కావడంతో విషయం తెలుసుకోని తహసిల్దార్ పుష్పలత పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితితో పాటు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యా బోధన, వంట గది, కూరగాయాలు, కోడిగుడ్లు, భోజన మెనూ, ఉపాధ్యాయులు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు రుచికరమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు, పాఠశాల సిబ్బందికి సూచించారు. కస్తూర్బాగాంధీ పాఠశాలలోని భోజన మెనూ సరిగా అమలు చేయాలన్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యార్థులు ఎలాంటి ఆలోచనలు పెట్టుకోకుండా పరీక్షలకు సిద్ధం అయి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ పద్మజ, ఆర్ఎస్ఐ శ్యామ్, ప్రత్యేక అధికారి మంకు వనితలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భయం వద్దు ఆత్మవిశ్వాసమే ముద్దు



**సూర్య సిరిసిల్ల టౌన్**

విద్యార్థులలో ఒత్తిడి ఆందోళన సహజమేనని భయాన్ని వీడి భయాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని తెలంగాణ రాష్ట్ర రైసేన స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ భూక్య హాజీ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులలో ఒత్తిడి ఆందోళన సహజమేనని ముఖ్యంగా విద్యార్థులు ఏకాగ్రత నిద్ర సమయపాలనతో విషయ నిపుణుల సూచనలతో ప్రణాళికలను రచించుకోవాలని సూచించారు. విద్యార్థులు బాగా చదివినప్పటికీ సరైన జవాబు రాయకపోతే ఫలితాలు రాకపోవడం పరీక్షల పట్ల కనీస అవగాహన కలిగి ఉండి ఎలా రాస్తే మంచి మార్కులు వస్తాయో తెలుసుకోవడం ముఖ్యమని అన్నారు. ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ తల్లిదండ్రుల సహకారం తీసుకోవాలని, ప్రతిరోజు చదివే సమయం ఏర్పరచుకొని అన్ని సబ్జెక్టులకు సమాన ప్రాధాన్యత ఇస్తూ కష్టమైన సబ్జెక్టుకు ఎక్కువ సమయం కేటాయించాలని అన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకం మీద పూర్తిపట్టు సాధించి ముఖ్యమైన పాయింట్లు అండర్లైన్ చేసుకొని ప్రాక్టీస్ చేయాలని సూచించారు. పరీక్షల సమయంలో కనీసం రోజుకు ఎనిమిది గంటల నిద్రపోవాలని, సరైన సమయానికి ఆహారం తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా మొబైల్ టీవీలకు దూరంగా ఉండాలని సూచించారు. మార్కులు అదృష్టం వల్ల రావని, ప్రణాళిక ప్రకారం కష్టపడుతూ ఇష్టపడి చదవడం వల్ల 100% ఉత్తీర్ణత సాధిస్తారని తెలిపారు. ఈ రోజు చేసిన కష్టం రేపటి విజయం అవుతుందని అభ్యాసం ఆత్మవిశ్వాసమే విజయానికి మార్గమని వారన్నారు. ఈ సమావేశంలో రాజన్న సిరిసిల్ల జిల్లా తెలంగాణ భవన్ నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు అక్కెనపల్లి భాస్కర్ పాల్గొన్నారు.

## ఉద్యమకారులను ఏ ప్రతిపాదికన ఎంపిక చేస్తారో స్పష్టత ఇవ్వాలి

**- రాష్ట్ర నాయకులు బుస్సా వేణు**

**సూర్య సిరిసిల్ల టౌన్**



తెలంగాణ రాష్ట్రంలో ఏ ప్రాతిపదికన ఉద్యమకారుల ఎంపిక చేపట్టుతారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు బుస్సా వేణు అన్నారు. సిరిసిల్ల జిల్లా పరిరక్షణ సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుస్సా వేణు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎన్నో మార్లు ప్రభుత్వాలకు విన్నవించుకున్నప్పటికీ ఎవరు పట్టించుకోలేదని అన్నారు. తెలంగాణ సాధించమని చెప్పుకుంటున్న కేసీఆర్ ఉద్యమకారులను విస్మరించారని అన్నారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యమం చేసినవాళ్లు కరువయ్యారని కానీ ఉద్యమకారులను ఆదుకుంటామని దీనికోసం ప్రత్యేక కమిటీని వేసి ఉద్యమకారుల ఎంపిక చేస్తామని తెలిపారని అన్నారు. ఏ ప్రాతిపదికన ఉద్యమకారుల ఎంపిక జరుపుతారో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని బుస్సా వేణు డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు కుసుమ విష్ణు,గోనె ఎల్లప్ప,మల్లేశం తదితరులు ఉన్నారు.

## మర్రిగడ్డ ప్రాథమిక పాఠశాలలో ఊయల, జారుడు బల్లను ప్రారంభించిన సర్పంచ్ మనీషా

**సూర్య చందుర్తి**



చందుర్తి మండలం మర్రిగడ్డ ప్రాథమిక పాఠశాల లో విద్యార్థుల కొరకు ఏర్పాటు చేసిన ఊయల, జారుడు బల్లలను బుధవారం రోజున గ్రామ సర్పంచ్ దూధి మనీషా శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా పని చేస్తున్న ఆకుల గంగనర్సయ్య వీటిని విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడప రఘుపతి రావు మాట్లడుతూ చిన్నారుల కొరకు వీటిని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని,పాఠశాల అవసరాలు తీర్చడంలో ఉపాధ్యాయులు కూడా తమ వంతు సహకారం అందిస్తారనడానికి నిదర్శనం ఈ ఊయలలు అని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఆకుల గంగనర్సయ్య అలాగే బదిలీలలో చందుర్తి పాఠశాలకు వెళ్లిన గుర్రం బాల కిషన్‌లను సర్పంచ్, చందుర్తి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లచ్చిరెడ్డి, ఉపసర్పంచ్,అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు షకీరా ఉపాధ్యాయ బృందంచే సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమములో చందుర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లచ్చిరెడ్డి, స్థానిక ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, ఉప సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి,వార్డు సభ్యులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బండ శంకర్,కీర్తి,ఉన్నత పాఠశాల ఉపాద్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సకాలంలో పనులు చెల్లించండి అభివృద్ధికి సహకరించండి

**- కమిషనర్ ఖాదర్ పాషా**

**సూర్య సిరిసిల్ల టౌన్**



సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని గృహ యజమానులు,వాణిజ్య గృహ యజమానులు ఆస్తి పన్ను,ట్రేడ్ లైసెన్స్,వివిధ లైసెన్స్ ఫీజులు, ప్రకటనల ఫీజులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఖాదర్ పాషా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి,పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా,వీధి దీపాల నిర్వహణ, డ్రైనేజ్ వ్యవస్థ బలోపేతం వంటి అభివృద్ధి కార్యక్రమాలు పన్నుల ద్వారా లభించే ఆదాయంతోనే నిర్వహించబడుతున్నాయని ప్రతి పన్నుదారుడు తన బాధ్యతగా భావించి బకాయిలు లేకుండా చెల్లించి పట్టణ అభివృద్ధికి సహ కరించాలని కోరారు. ప్రస్తుతం పుర పాలక సిబ్బంది మొత్తం పన్నుల వసూళ్లలో నిమగ్నమై,ఇంటింటి సేకరణ, ఫీల్డ్ సందర్శనలు నిర్వహిస్తూ లక్ష్య సాధనకు కృషి చేస్తున్నారని,పట్టణ ప్రజలు సహకరించి సకాలంలో పన్నులు చెల్లించగలరని వారు కోరారు.

## ఆశిరెడ్డి పల్లి ప్రాథమిక పాఠశాలలో ఘనంగా జాతీయ భద్రత దినోత్సవం

**సూర్య చందుర్తి**



చందుర్తి మండలం, అసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం రోజున జాతీయ భద్రతా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు "రోడ్డు భద్రత నియమాలు-ప్రమాదాల నివారణ" పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎన్. రజిత మాట్లాడుతూ...ట్రాఫిక్ సంకేతాలను పాటించడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు ప్రయాణికులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.వేగ పరిమితులు పాటించడం, మద్యం సేవించి వాహనాలు నడపరాదు అని డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్ వాడవద్దన్నారు. జీబ్రా క్రాసింగ్ దగ్గర రోడ్డు దాటడం వంటి ప్రాథమిక నియమాలు పాటించాలిఅని ప్రతి ఒక్కరు వాహనాలు నడుపుతున్నప్పుడు ఈ ట్రాఫిక్ తెలుసుకొని బాధ్యతగా రోడ్డు ప్రయాణం చేస్తే భద్రంగా గమ్యాన్ని చేరుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపతి రమేష్, అర్చిత, తిరుమల విద్యార్థులు పాల్గొన్నారు.

## చెరువులకు చేరిన గోదావరి జలాలు

**- రైతులతో కలిసి పూజలు చేసిన సర్పంచ్**

**సూర్య కోనరావుపేట**



మల్కపేట రిజర్వాయర్ కుడి కాలువ ద్వారా గోదావరి జలాలు మేలకుంట చెరువులోకి, అక్కడి నుంచి పెద్దచెరువుకు చేరేలా సర్పంచ్ జిన్న అనూష బుధవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జిన్న అనూష-అనిల్ కుమార్ పాలకవర్గ సభ్యులు, రైతులతో కలిసి గోదావరి జలాలకు పూజలు నిర్వహించారు. యాసంగి సీజన్‌లో నీటి కొరతతో ప్రతి సంవత్సరం పంటలు ఎండిపోతూ రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ అనూష తెలిపారు. రైతుల సమస్యలను గుర్తించి అధికారులతో చర్చించి కాలువల ద్వారా చెరువులకు నీరు వచ్చేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ జలాలు రైతుల పొలాలకు ప్రాణాధారంగా మారి పంటలను కాపాడటంతో పాటు గ్రామ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం తమ వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని హామీ ఇచ్చారు. నీటి విడుదలతో గ్రామ రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. సర్పంచ్ అనూష-అనిల్ కుమార్‌ను రైతులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వాసంపెల్లి శ్రీనివాస్, వార్డు సభ్యులు జాగిరి ఆనందం, మోకేనపెల్లి బాలరాజు, జాగిరి లక్ష్మీ, చిద్రవేణి నరేష్, జిన్నా సమత, రేగుల పద్మ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణం

**- ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ విప్ అది**

**సూర్య రుద్రంగి**



రుద్రంగి మండల కేంద్రంలోని శ్రీ ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణం, జాతర మహోత్సవం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవంకు ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. అర్చకులు ఉదయం నుంచి పూజలు, హోమం లాంటి కార్యక్రమాలు జరిపించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం సభ్యులు మాట్లాడుతూ ఉదయం నుండే భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చారని వారికోసం అన్నదానం, నీటి వసతి లాంటి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ చెలుకల తిరుపతి, సర్పంచ్ గండి నారాయణ, నాయకులు, గంగపుత్ర సంఘం సభ్యులతో పాటు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

జగిత్యాల

గురువారం 5 మార్చి 2026



# ఉండేడ గ్రామంపై ఆర్టీసీ శీత కన్ను

## - డిజిటల్ యుగంలో ఎర్ర బస్సు ఎరుగని గ్రామం - ప్రజా ప్రభుత్వంలోనైనా బస్సుకు మోక్షం కలిగేనా - ఉండేడ గ్రామానికి బస్సు నడిపించాలని గ్రామస్తులు వేడుకోలు

<u>సూర్య ఎండపల్లి</u>

డిజిటల్ యుగంలో ప్రపంచీకరణ తో రవాణా సౌకర్యాలుమెరుగుపడి ప్రపంచం లో ఏ మూల కైనా వెళ్లగలిగే ఈ కాలంలో కూడా ఎర్రబస్సు ఎరగని ఏకైక గ్రామం మండలంలోని ఉండేడా ఈ గ్రామానికి గతంలో 9 సంవత్సరాల క్రితం కరీంనగర్ నుండి ఉండేడ గ్రామానికి ఉదయం 5 గంటలకు 9 గంటలకు 4గంటలకు రాత్రి 9 గంటలకు బస్సు సౌకర్యం ఉండేది ఈ బస్సు రాత్రి గ్రామంలోనే బసచేసి తిరిగి ఉదయం యథావిధి గా 4 ట్రిప్పులు నడిచేది. అలాగే గోదావరిఖనిడిపోకుచెందిన బస్సు వేమునూరు ఉండేడా తాళ్ల కొత్తపేట నుండి వెల్గటూర్ వరకు వెళ్ళేది. ఒకరోజుకు ఈ బస్సు కూడా మూడు సార్లు వచ్చేది. ఈ గ్రామం ఎల్లంపల్లి శ్రీపాద




ప్రాజెక్టు ముంపులోనీటమునిగింది. అలాగే వేమునూరు పంప్ హౌస్ నిర్మాణ పనుల క్రమం లో రోడ్లు లేకపోవడం తోఈగ్రామానికి రాక పోకలు నిలిచిపోయాయి. బస్సు సౌకర్యాలు నిలిపివేశారు. ఆర్ అండ్ ఆర్ కాలనీ నూతన ఉండే డా గ్రామం నిర్మించి దాదాపు 10 నుంచి 11 సంవత్సరాలు గడుస్తున్నా. ఇప్పటివరకు బస్సు రాని గ్రామంగా మిగిలిపోయింది. ఎర్ర బస్సు ఎరగని ఉండడ గ్రామానికి ఈ డిజిటల్ యుగంలో కూడా సౌకర్యం లేకపోవడంతో ప్రజలకు విడ్డూరంగా ఉంది, ఈ గ్రామ ప్రజలు రవాణా సౌకర్యం లేక అనేక ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. మండల కార్యాలయాలకు పోవ డానికి, ఆసుపత్రి సౌకర్యానికి 17 కిలోమీటర్ల దూరం వెళ్లాలి, కనీసం ఆటో సౌకర్యం కూడా సరిగ్గా లేదు ఆటోలో వెళ్తే 50 నుంచి 60 రూపాయలు చార్జీలు చెల్లించాల్సి వస్తుంది ప్రభు త్వం స్పందించి ఇప్పటికైనా ధర్మారం కరీంనగర్ పట్టణాలకు వెళ్లే బస్సు సౌకర్యం కల్పించాలని ఇక్కడి గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు.

# డిజిటల్ విద్య బోధన విద్యార్థులకు చాలా ఉపయోగకరం

## - అడిషనల్ కలెక్టర్ బి.ఎస్. లత

<u>సూర్య జగిత్యాల ప్రతినిధి</u>

వినడం ద్వారా నేర్చుకునే దాని కన్నా చూసి నేర్చుకోవడం ఎంతో మేలు చేస్తుందని అందు వలన డిజిటల్ విద్య వలన విద్యార్థులు పాఠాలు బాగా నేర్చుకుంటారు అందువలన డిజిటల్ విద్య ఎంతో మేలు చేస్తుందని జిల్లా అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత అన్నార్రు. బుధవారంం జగిత్యాలలోని ఓల్డ్ హై స్కూల్ లో రోటరీ క్లబ్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన రీయూసేబుల్ వాసిబుల్ క్లాత్ సానిటరీ ప్యాడ్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడుతూ విద్యకు అసౌకర్యం కలగకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని



వారన్నారు. జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశా లలో మౌలిక వసతుల కల్పన కొరకు కృషి చేస్తున్న రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం అన్నారు. అనంతరం ఆరు లక్షల విలువచేసే సానిటరీ ప్యాడ్స్ జగిత్యాల అర్బన్ మండల పరిధిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న ఎనిమిది వందల మంది విద్యార్థి నులకు పంపిణీ చేశారు అనంతరం ముందస్తు మహిళా దినోత్సవం జరిపి కేక్ కట్ చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్పర్సన్ కౌన్సిలర్లను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ అరవ లక్ష్మి, మండల విద్యాధికారి చంద్రకళ, రోటరీ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏవీఎల్ ఎన్ చారి, రాజు రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, టీవీ సూర్యం, బొడ్ల జగదీష్, పిఆర్టియుటిఎస్ జగిత్యాల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయినిపెల్లి ఆనంద్ రావు యాల్ల అమర్నాథ్ రెడ్డి ప్రముఖ వైద్యులు స్వరూప పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ...

## - మల్యాల మండలంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత

<u>సూర్య మల్యాల</u>

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా బుధవారం మల్యాల మండలంలో పరీక్ష కేంద్రా న్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో నిర్వహణ విధా నం, ప్రశ్నపత్రాల భద్రత, హాల్ టికెట్ల పరిశీలన ప్రక్రియలను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత మాట్లాడుతూ విద్యార్థులకు అవసం మైన మౌలిక సదుపాయాలు సమకూర్చడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించా రు. పరీక్షా గదుల్లో వెలుతురు, తాగునీరు, శౌచాలయాల నిర్వహణ సక్రమంగా ఉన్నాయా అనే విషయాలను పరిశీలించారు.విద్యార్థులు



ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అను మతించరాదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా కొనసాగాలని సూచిం చారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో పారదర్శకత, క్రమశిక్షణ పాటిం చడం అత్యంత ముఖ్యమని తెలిపారు.పరీక్షా సిబ్బంది తమ విధులను నిబద్ధతతో, భాధ్యతగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ఫిర్యా దులు వచ్చినా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశిం చారు. విద్యుత్ సరఫరా అంతరాయం కలగ కుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.పరీక్షలు పూర్తయ్యే వరకు అప్రమ త్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వసంత, ఆర్ఐ తిరుపతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫైర్ సేఫ్టీపై ఆర్టీసీ ఉద్యోగులకు అవగాహన

<u>సూర్య జగిత్యాల ప్రతినిధి</u>




జగిత్యాల ఆర్టీసీ బస్ డిపో ఆవరణలో అగ్ని మాపక శాఖ అధ్యక్షులు నేష నల్ సేఫ్టీ వీక్ సందర్భాన్ని పుర స్కరించుకొని ప్రమాదాలు సంభవించిన ప్పుడు ఏ విధంగా ఫైరింగ్ ఉపయోగించాలి అనే కాన్సెప్ట్ పై బస్ డిపోలోని ఉద్యోగులకు బుధవారం తగు మెలకువలు నేర్పించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో ఆ శాఖ ఎల్లపు ఫిట్టర్ జి మధు, టీం లీడర్ వారి సిబ్బంది ఆర్టీసీ డిపో మేనేజర్ కే కల్పన, ఎం.ఎఫ్ కవిత, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్ డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్దే మా లక్ష్యం

**- సర్పంచ్ దోరిశెట్టి మల్లేశం**

<u>సూర్య వెల్గటూర్</u>



గ్రామ అభివృద్దే మా లక్ష్యంమని,అభివృద్ధి దిశగా అడుగులు వేస్తూ, స్వలా భం ఆశించకుండా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని రాజక్క పల్లి గ్రామ సర్పంచ్ దోరిశెట్టి మల్లేశం పేర్కొన్నారు. బుధవారం గ్రామం లోని పోచమ్మ ఆలయం ప్రాంగణంలో సర్పంచ్ మల్లేశం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం సమిష్టిగా శ్రమదానం నిర్వహించారు. ఆలయం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు,చెత్తను తొలగించారు. అంత కుముందు గ్రామ అభివృద్ధి, పారిశుద్ధ్యం,దేవాలయల పరిరక్షణకు కట్టుబడి పని చేస్తామని,సర్పంచ్ మల్లేశం పాలకవర్గం సమిష్టిగా ప్రతిజ్ఞ చేశారు. గ్రామ ప్రగతి పథంలో నడిపించడానికి ఎల్లవేళలా కష్టపడుతామని సర్పంచ్ దోరిశెట్టి మల్లేశం తెలిపారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మర్రి పోచయ్య,సెక్రటరీ స్రవంతి, వార్డు సభ్యులు రంగు మల్లేష్,కామిరె రమేష్,దోరిశెట్టి తిరుపతి, రమేష్, కొల్లూరి జితేందర్, తిరుపతి, పోచయ్య, పోతరాజుల చంద్రశేఖర్, ప్రశాంత్, శ్రీకాంత్ గ్రామప్రజలు పాల్గొన్నారు.

## జిల్లాలో ఆరవ రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

<u>సూర్య జగిత్యాల అర్బన్</u>

జగిత్యాల జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు 30 పరీక్ష కేంద్రా ల్లో నిర్వహించడం జరిగింది. జనరల్ కోర్సులకు సంబంధించి 6080 విద్యార్థులకు గాను 5976 విద్యార్థులు హాజరు కాగా 104 విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 845 విద్యార్థులకు గాను 807 విద్యార్థులు హాజరు కాగా 38 మంది విద్యార్థులు గైర్హాజర య్యారు. మొత్తంగా 97.95% విద్యార్థులు పరీక్షలు రాశారు. జిల్లాలోని ప్రతి పరీక్షా కేంద్రంలో వైద్య శిబిరం కలదు కావున అవసరమైన విద్యా ర్థులు వినియోగించుకోవాలని ఎవరైనా విద్యార్థులు ఈ రోజు పరీక్ష సరిగ్గా రాయకపోయినప్పటికి ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా రేపటి పరీక్షకు సిద్ధం కావాలని, ఎలాంటి అనుచిత నిర్ణయాలు తీసుకోకూడదని సూచించారు.జిల్లాలో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, విద్యార్థులు ఏదైనా మానసిక ఒత్తిడికి లోనవుతున్న వారు టెలిమానస్ సహాయ కేంద్రం నెంబర్ 14416 కి ఫోన్ చేసిమానసిక వైద్యుల సహాయం పొందగలరని జిల్లా పరీక్షల కన్వీనర్ బి. నారాయణ తెలిపారు.

## కన్నుల పండువగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి రథోత్సవం

<u>సూర్య,రాయికల్</u>

వేద పండితులు రామకృష్ణ చార్యుల మంత్రోచ్చరణల మధ్య,మేళతాలాల నడుమ,భక్తుల గోవింద నామస్మరణ మధ్య శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి రథోత్సవం రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో బుధవారం కన్నుల పండుగ జరిగింది.ఈ కార్యక్రమానికి రాయికల్, మల్లాపూర్ మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయం వద్ద నుండి రథంపై ఆసీనం చేసి,రథహోమం, రథ బలి నిర్వహించి, రథోత్సవ కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వ హించారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ వంశీయులు చెన్నమనేని వంశీ వర్ధన్ రావు, విష్ణువర్ధన్ రావు,గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్,ఉప సర్పంచ్ సాయి రెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు మల్లారెడ్డి, రఘునాథం, వేణు, చిన్నదింబాద్రి గౌడ్, శ్రీనివాస్, గ్రామ నాయకులు, వార్డు సభ్యులు, యూత్ సంఘాల సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు

## - పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**సూర్య మంథని**

యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. మంథని లోని గంగాపురి ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని, గౌతమి నగర్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, టాస్క్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



మాట్లాడుతూ... ప్రభుత్వ 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా టీజిఐఐసి సంస్థ ఆధ్వర్యంలో గార్మెట్ యూనిట్ల ఏర్పాటు చేసేందుకు వీలుగా 2 ఎకరాలు భూమిని కేటాయించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. టాస్క్ సెంటర్ ద్వారా యువత మంచి శిక్షణ అందించేందుకు వీలుగా మంథనిలో సెంటర్ ఏర్పాటు చేశామని, అవసరమైన పక్షంలో మరో భవనానికి కూడా విస్తరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మంథని ఆర్డీవో సురేష్, తహసిల్దార్ ఆరిఫోద్దీన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలిగేడు సెక్షన్‌లో ఘనంగా లైన్మెన్ దివాస్ వేడుకలు

**సూర్య - ఎలిగేడు**

ఎలిగేడు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో బుధవారం విద్యుత్ సెక్షన్ ఆధ్వర్యంలో లైన్మెన్ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను నిరంతరం సజావుగా కొనసాగించడంలో కీలక పాత్ర పోషిస్తున్న సిబ్బందిని ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. సెక్షన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్, లైన్మెన్లు, అసిస్టెంట్ లైన్మెన్లు, ఆర్టిజెన్స్ మరియు అన్‌మ్యాన్డ్ కార్మికులకు ప్రశంసాపత్రాలు అందజేసి, శాలువాలతో సన్మానించారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు తలెత్తినప్పుడు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించే వారి సేవలను అధికారులు కొనియాడారు. కార్యక్రమానికి ముఖ్య



అతిథిగా హాజరైన అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ రామస్వామి మాట్లాడుతూ, ఎండలు, వర్షాలు, తుఫానులు వంటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు లైన్మెన్లు అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. ప్రమాదాలను లెక్కచేయకుండా విధులు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎలిగేడు అసిస్టెంట్ ఇంజనీర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ, విద్యుత్ శాఖలో లైన్మెన్ల సేవలు అమూల్యమని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో వారి పాత్ర ఎంతో ముఖ్యమని, సిబ్బంది సంక్షేమం కోసం శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని చెప్పారు. సబ్ ఇంజనీర్ అనిల్ మాట్లాడుతూ, భద్రతా నియమాలను కచ్చితంగా పాటిసూ విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా పలువురు లైన్మెన్లు తమ అనుభవాలను పంచుకుని, సేవలో ఎదురయ్యే సవాళ్లను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎల్ ఐ రాజమల్లు, ఎలిగేడు టౌన్ లైన్మెన్ రాజ్ కుమార్ దూళికట్ట లైన్మెన్ భాస్కర్, ఉద్యోగులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## పోచమ్మ గుడి వద్ద సెల్ టవర్ మాకొద్దు !

**- గ్రామ సభలో గ్రామస్థుల తీర్మానం**

**సూర్య - పెద్దపల్లి రూరల్**



పోచమ్మ గుడి వద్ద గ్రామ పంచాయితీకి సమాచారం లేకుండా పోచమ్మ గుడి వద్ద నిర్మాణం చేపట్టిన సెల్ టవర్ పనులు నిలిపివేయాలని పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామస్థులు ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామ పంచాయితీ ఆవరణలో బుధవారం సర్పంచ్ మేకల రోజారాణి విజయ్ కుమార్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. పోచమ్మ గుడి ముందు సెల్ టవర్ నిర్మాణ పనులు చేస్తుండగా గ్రామస్థులు పంచాయితీ పాలకవర్గం ఆద్వర్యంలో పనులు నిలిపివేయించారు. గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా సెల్ టవర్ నిర్మాణం చేయవద్దని, అవసరమైతే ప్రజలకు ఇబ్బందులు లేకుండా వేరే ప్రాంతంలో సెల్ టవర్ నిర్మాణం చేపట్టుకుంటే అభ్యంతరం లేదని గ్రామసభలో ప్రజలు, పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామసభ తీర్మానాన్ని జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలని ప్రజలు పంచాయితీ కార్యదర్శికి సూచించారు. ఒకవేళ సెల్ టవర్ నిర్మాణ పనులు అక్రమ మార్గంలో కొనసాగిస్తే పెద్దపల్లి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని పలువురు గ్రామస్థులు తెలిపారు. సమావేశంలో ఉప సర్పంచ్ జంగిలి శేఖర్, పంచాయితీ కార్యదర్శి ఝాన్సీ, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వైభవంగా పోచమ్మ బోనాల వేడుకలు

**సూర్య - పెద్దపల్లి రూరల్**



పెద్దపల్లి మండలం రాంపల్లి శివారులోని డబుల్ బెడ్ రూం కాలనీలో బుధవారం వైభవంగా పోచమ్మ బోనాల వేడుకలు నిర్వహించారు. డప్పు చప్పుల నృత్యాలతో కాలనీ వాసులు బోనాలతో ఊరేగుంపుగా వెళ్ళి ముత్యాల పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. మమ్మల్ని చల్లగా చూడు తల్లీ అని పోచమ్మ దేవతను వేడుకున్నారు. డబుల్ బెడ్ రూం కాలనీ వాసులు పిల్లా పాపలతో ఉత్సాహంగా బోనాల వేడుకలో పాల్గొని పోచమ్మ తల్లికి మొక్కులు తీర్చుకున్నారు.

## డ్రైనేజీ మరమ్మతులు....

**సూర్య - పెద్దపల్లి రూరల్**

మండలంలోని పెద్దకల్వల గ్రామంలోని 10 వ వార్డులో డ్రైనేజీ పైపు డామేజ్ వల్ల మురుగునీరు రోడ్డుమీదికి వచ్చి వార్డు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై సర్పంచ్ నర్ల కనకమ్మ పోలురాజుకు వార్డు సభ్యులు సమస్య వివరించగా సకాలంలో స్పందించి డ్రైనేజీ మరమ్మత్తు చేయించి నూతన డ్రైనేజ్ పైపు వేయించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పర్స లక్ష్మి శంకర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## శ్రీ లక్ష్మీనృసింహస్వామికి ప్రత్యేక పూజలు

**సూర్య - పెద్దపల్లి రూరల్**



పెద్దపల్లి మండలం దేవునిపల్లి శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో బుధవారం ఆలయ అర్చకులు కొండపాక శ్రీకాంత్ చార్యులు, రామాచార్యులు ఆద్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాల్గుణ పౌర్ణమి పురస్కరించుకుని స్వామివారికి, అమ్మవారికి పంచామృత అభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

**సూర్య - పెద్దపల్లి రూరల్**



పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు సర్పంచ్ మేకల రోజారాణి విజయ్ కుమార్ ఆద్వర్యంలో బుధవారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎల్పీఓ దేవకీ దేవి, ఎంపిడిఓ శ్రీనివాస్ చేతుల మీదుగా పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. పదవ తరగతి పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి ప్రోత్సహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన దాసరి

**సూర్య-ఎలిగేడు**



ముప్పిరితోట గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు గోళ్ళే లక్షణ్ తండ్రి మొండయ్య దశదిన కార్యక్రమం బుధవారం నిర్వహించబడింది. కార్యక్రమానికి పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి హాజరై మృతుడికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని, పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి రామిరెడ్డి, నాయకులు, చీకటి సంతోష్ కుమార్, శ్రీనివాస్, రమేష్, పార్టీ శ్రేణులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 'ఖని' లో అంబరాన్నంటిన హోళీ సంబరాలు

**- నగరంలో రూ.800 కోట్ల అభివృద్ధి పనులు**

**- రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి**

**సూర్య-గోదావరిఖని**



రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో నిర్వహించిన హోళీ సంబరాలు అంబరాన్నంటాయి. రంగుల హర్షధ్వానాల మధ్య ప్రజలు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మహంకాళి స్వామి ప్రజలందరికీ హోళీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నా-పెద్దా తేడా లేకుండా కొత్తగా ఎన్నికైన పాలకవర్గం ప్రజలతో మమేకమై పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. రామగుండం నగరాన్ని 2029 నాటికి సకల సౌకర్యాలతో సంపూర్ణంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో శాసన సభ్యుడు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే రూ.800 కోట్లతో నగరంలో పలు అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. ప్రజలందరూ సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నం పెట్టే రైతుపై ప్రభుత్వ నిర్లక్ష్యమేలా...!?

## - రైతు ప్రజా సంఘాల సమాఖ్య

**సూర్య, హుజురాబాద్**

దేశానికి అన్నం పెట్టే రైతన్నకి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం ఏమిటని..? రైతు, ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు అన్నారు. బుధవారం ఆయన హుజురాబాద్ లో మాట్లాడుతూ... అన్నదాతల సంక్షేమం కోసం ఎన్నో హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు అవి మరిచిపోయాయని, దాంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలోని రైతులు ముఖ్యంగా కౌలు రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. కౌలు రైతుల ఉద్ధరణ కోసం అనేక కమిటీలు చేసిన సిఫారసులను వెంటనే ప్రభుత్వాలు అమలు చేయాలన్నారు. రైతుల పంటల పై ప్రస్తుతం అమలు జరుగుతున్న గిట్టుబాటు ధరలు అన్న దాతలకు ఏ మాత్రం ఆమోదయోగ్యంగా లేనే లేవని, రైతులు



పండించిన పంటలకు రైతులే గిట్టు బాటు ధరలను నిర్ణయించుకునే అవకాశం కల్పించే విధంగా జాతీయ స్థాయిలో ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రస్తుత పరిస్థితుల్లో కూలీల కొరత పెరుగు తోందని, ఖర్చులు బాగా పెరిగి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతుల వ్యవసాయ రంగానికి చేయూతనిచ్చేందుకు గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చెయ్యాలంటే జాతీయ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ రంగాన్ని తక్షణమే అనుసంధానం చేయాలన్నారు. రైతు భీమా వయో పరిమితిని 70ఏళ్లకు పెంచాలని, 50ఏళ్లు నిండిన రైతులకు నెలకు కనీసం 6వేల రూపాయల పెన్షన్ సౌక ర్యం కల్పించాలని, రైతుల అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు 10లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని, ఆర్థికంగా వెనుక బడిన అగ్రకుల పేదల సంక్షేమం కోసం జాతీయ స్థాయి ఓసి కమిషన్ ఏర్పాటు చేయాలనే తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 28న ఓసి ఐకాస, రైతు ప్రజాసంఘాల ఆధ్వ ర్యంలో కరీంనగర్‌లో లక్ష మందితో రాష్ట్ర స్థాయి రైతు మహాగర్జన సమరభేరి సభను నిర్వహిం చనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు మిత్ర సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి స్వామి రెడ్డి, ప్రధాన కార్యదర్శి చందుపట్ల నరసింహ రెడ్డి, నాయకులు బోయినపల్లి దేవేందర్ రావు, గూడూరి శంకర్ రెడ్డి, గూటం జోగిరెడ్డి, మేకల చంద్రయ్య, చైతన్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవోల ఆధ్వర్యంలో ఘనంగా హోలీ సంబరాలు

**సూర్య, కరీంనగర్**



కరీంనగర్ జిల్లా టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో హోలీ సంబరాలు జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో ఉత్సాహంగా నిర్వహించారు. రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులతో కలిసి రంగులు చల్లుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్, దారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు తదితరులు మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ నివాసానికి వెళ్లి హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు ఒంటెల రవీందర్ రెడ్డి, జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్, రాష్ట్ర నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మీందర్ సింగ్, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, కార్యదర్శి వెలిచాల సుమం తరావు, రూరల్ అధ్యక్షుడు కోడూరి వాస్తవిక్ గౌడ్, కార్యదర్శి కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, నాయకులు కోట రామస్వామి, శంకర్, రమేష్ గౌడ్, ప్రసాద్ రెడ్డి, ఎ.వి. రాజేశ్వరరావు, నగేష్ గౌడ్, బైరి శ్రీనివాస్, కోటేశ్వర, అల్లే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. రంగుల సందడి మధ్య జరిగిన ఈ వేడుకలు ఉద్యోగుల ఐక్యతను మరింత బలోపేతం చేశాయి.



## నర్సింగాపూర్‌లో కొండచిలువ కలకలం

### - ప్రాణభయంతో వణికిపోతున్న గ్రామస్తులు

**సూర్య, వీణవంక**



వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామంలో గత కొన్ని రోజులుగా కొండచిలువ సంచారం స్థానికులను తీవ్ర భయాం దోళనలకు గురిచేస్తోంది. ఎప్పుడు, ఎటువైపు నుంచి ముంచుకొస్తుందో తెలియక గ్రామస్తులు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు. పొలాల్లోనే కాకుండా, గ్రామ శివారు ఇళ్ల సమీపంలో కూడా భారీ కొండచిలువ కనిపిస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పాము భయంతో రైతులు పొలం పనులకు వెళ్లడానికి, పశువుల కాపరులు అడవి వైపు వెళ్లడానికి జంకుతున్నారు. పిల్లలు, వృద్ధులు బయట తిరగాలంటేనే భయపడుతున్నారని, వెంటనే అటవీ శాఖ అధికారులు స్పందించి కొండ చిలువను బంధించి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టాలని నర్సింగాపూర్ ప్రజలు వేడుకుంటున్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు చింతన మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో జాతీయస్థాయి ప్రథమ ర్యాంకు

**సూర్య, కరీంనగర్**



కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు చింతన ఒలంపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో విశేష ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను సన్మానించారు. డి. సాత్విక్ (7వ తరగతి) జాతీయ స్థాయి ప్రథమ ర్యాంకు సాధించగా, ఏ. రీతిక (6వ తరగతి), జి. సహాన్స్ రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకులు సాధించారు. కే. అతిథ్ కిషన్ (4వ తరగతి), ఏ. సాయి చందన (5వ తరగతి), ఎం. శ్రేయాన్ కార్తీక్ (9వ తరగతి) జిల్లా స్థాయి ప్రథమ ర్యాంకులు పొందారు. విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించిన డాక్టర్ నరేందర్ రెడ్డి, గణిత శాస్త్రంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీరాములపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

**సూర్య, జమ్మికుంట రూరల్**



ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని బిఆర్సీ ఇంచార్జీ మురళీధర్ అన్నారు. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె) ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టులో భాగంగా బుధవారం శ్రీరాములపల్లి గ్రామంలోని రైతు తిప్పారపు వీరన్న నివాసం వద్ద రైతులకు ప్రత్యేక అవగా హన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి సిద్ధమైన పద్ధతుల్లో చీడపీడల నివారణపై రైతులకు లోతైన అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ... అగ్నిఅస్త్రం, నీమాస్త్రం వంటి సహజ కషాయాలతో మొగిపురుగు, అగ్గి తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. మహిళా రైతులకు అగ్నిఅస్త్రం తయారీని ప్రయోగాత్మకంగా చూపించారు. భూమి ఆరోగ్యం, ప్రజల ఆరోగ్యం ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఫెసిలిటేటర్లు మమత, ఆకేంద్ర, కిరణ్‌తో పాటు సుమారు 40 మంది మహిళా, పురుష రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

**సూర్య, హుజురాబాద్**

హుజురాబాద్ పట్టణ శివారులోని కేసి క్యాంపు వద్ద వరంగల్ – కరీంనగర్ జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో వృద్ధునికి గాయాలయ్యాయి. ఈ సంఘటనలో ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన బొమ్మనవేణి చంద్రయ్యకు గాయాలు అయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రకృతి రంగులతో హోలీ సంబరాలు

### - ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆనందోత్సవం

**సూర్య, కరీంనగర్**



కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హోలీ పండుగను సహజ రంగులతో ఘనంగా నిర్వహించారు. రసాయనిక రంగులను నివారించి బిక్సా, మోదుగ, మందారం, తంగేడు, గన్నేరు, బంతి, రోజా, అపరాజిత పువ్వులు, పసుపు, బీట్రూట్, క్యారెట్ తదితర సహజ వనరులతో రంగులు తయారు చేసి విద్యార్థులు ఉత్సాహంగా జరుపుకున్నారు. కార్యక్రమం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. మనోజ్ కుమార్, డాక్టర్ విద్య, డాక్టర్ ఆర్. దేవేందర్, రేఖా రాణి, ప్రియాంక, రావళి, అనిత, నారాయణ, మౌనిక తదితరులు పాల్గొన్నారు. సహజ రంగులతో హోలీ జరుపుకోవడం పర్యావరణం, ఆరోగ్య పరిరక్షణకు దోహదమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. విద్యార్థులు ఆనందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వెదురుగట్టలో వైభవంగా శ్రీ వెంకటేశ్వరస్వామి రథోత్సవం

### - వేరువేరుగా దర్శించుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
### - కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్

**సూర్య, చొప్పదండి**



చొప్పదండి మండల పరిధిలోని వెదురుగట్ట గ్రామంలో ప్రతి సంవత్సరం జరిగే శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భక్తుల గోవింద నామస్మరణతో పరిసరాలు మారుమోగగా, స్వామివారిని ప్రత్యేక రథంపై భక్తులు దర్శించుకున్నారు. ఈ వేడుకను వీక్షించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరాగ కన్నుల పండుగగా జరిగింది. ఈ వేడుకకు స్థానిక శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు మేడి పల్లి సత్యం, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్‌లు వేరువేరుగా హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించి, తీర్థ ప్రసాదాలు అందించి, వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంచాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ మారం సమత శ్రీనివాస్ వార్డ్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇప్పశ్రీనివాస్ రెడ్డితో పాటు పురం రాజేశం, చిలుక సంజీవ్, పంతంగి ప్రభాకర్, అడ్డగుంట శంకర్, చిలుక చంద్రయ్య, జక్కుల శంకర్, పెంచాల సాగర్ తదితరులు పాల్గొన్నారు.



## ఉప ముఖ్యమంత్రి కుటుంబ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**సూర్య, జగిత్యాల**



హైదరాబాద్ ప్రజా భవన్లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య ముందస్తు వివాహ వేడుక పెళ్లి కొడుకు వేడుక కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ రాధిక దంపతులు.

# ఆనందోత్సాహాల మధ్య హోళీ పండుగ వేడుకలు

**సూర్య, హుజురాబాద్**

రంగుల పండుగ హోళీ పర్వదిన వేడుకలు హుజురాబాద్ పట్టణంలో బుధవారం ప్రజలు రంగులు చల్లుకొని ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం చంద్రగ్రహణం ఉండడంతో పాక్షికంగా హోళీ వేడుకలు కొంత మంది మాత్రమే జరుపుకున్నారు. బుధవారం ఉదయం నుండే యువతీ, యువకులు, పిల్లలు, పెద్దలు, వయసుతో సంబంధం లేకుండా తమ స్నేహితులతో, బంధువులతో రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ ఆనందంగా గడిపారు. పలువురు వాహనాలపై స్నేహితులతో కలిసి రంగులు చల్లుకుంటూ ఒక్కొక్క ఇంటికి వెళ్లి వారికి రంగులు తల్లి వారిని కూడా వారితో



తీసుకొని వెళ్లి హైస్కూల్ మైదానంలో పాటల కనుగుణంగా నృత్యాలు చేశారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ రెంటాల సుహాసిని, మాజీ చైర్ పర్సన్ గందె రాధిక, టౌన్ సిఐ టి. కరుణాకర్, ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, కౌన్సిలర్ ఇల్లందుల సమ్మయ్య,



వర్ధినేని రవీందర్ రావు, న్యాయవాది ముక్కెర రాజు, మాజీ కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, బిజెపి నాయకులు కొలిపాక శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఉప్పు శ్రీనివాస్ పటేల్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కాయిత రాములు, రవీందర్, పలువురు జర్నలిస్టులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, యువకులు పాల్గొన్నారు.

## మామిడాలపల్లిలో వైభవంగా శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి ద్వితీయ వార్షికోత్సవాలు

**సూర్య, వీణవంక**

వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామంలో వెలసిన శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మార్చి 4వ తేది బుధవారం నుండి మార్చి 6వ తేది శుక్రవారం వరకు మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి వెల్లడించింది. మార్చి 4 బుధవారం ఉత్సవాల తొలిరోజున ఉదయం సుప్రభాత సేవ, నిత్యాభిషేకం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం హరిహర దేవతా హోమం, రుద్ర హోమం శాస్త్రోక్తంగా జరిగాయి. మార్చి 5



గురువారం రెండవ రోజు ఉదయం గణపతి పూజతో పాటు ప్రత్యేక ఆకర్షణగా "అష్టోత్తర శతకలశ స్థాపన (108) ఆరాధన", సామూహిక మహామృత్యుంజయ హోమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం దుర్గా, సుబ్రహ్మణ్య అఘోర పాశుపత హోమాలు జరగనున్నాయి. మార్చి 6 శుక్రవారం ముగింపు రోజున ఉదయం ఆలయ ధ్వజస్తంభ పూజ, కుంభ ప్రోక్షణ, మహా పూర్ణాహుతి నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు అత్యంత వేడుకగా "శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి లీలా వైభవ కళ్యాణోత్సవం" నిర్వహించబడుతుంది. అనంతరం వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ ఉంటుంది. ఈ కార్యక్రమాలు బ్రహ్మశ్రీ చౌదరి మఠం వినోద్‌మార్ శాస్త్రి గారి వైదిక నిర్వహణలో, ఆలయ ప్రధాన అర్చకులు శివశ్రీ చౌదరి మఠం మల్లిఖార్జున స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఆలయ చైర్మన్ గుడిపాటి రాజిరెడ్డి, గ్రామ సర్పంచ్ శ్రీరామోజు చంద్రమౌళి – సత్యవతి, గ్రామ ప్రజలు ఈ వేడుకలను పర్యవేక్షిస్తున్నారు.గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ వారు కోరారు. ప్రతిరోజూ భక్తులకు అన్నప్రసాద వితరణ సౌకర్యం కల్పించారు.

# నూతన మున్సిపాలిటి పాలకవర్గం సభ్యులకు సన్మానం

**సూర్య, చొప్పదండి**

చొప్పదండి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తాటిపెల్లి అంజయ్య అద్వర్యంలో బుధవారం రోజున నూతనంగాఎన్నికైనా మున్సిపాలిటి చైర్మేన్, వడ్లూరి సరిత-శ్రీనివాస్, వైస్ చైర్మేన్ పెరుమండ్ల మానస-గంగయ్య మరియు అన్ని వార్డుల కౌన్సిలర్లకు వాకర్స్ క్లబ్ తరుపున ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో, క్రీడా మైదానం అభివృద్ధి లో బాగంగా వాకింగ్ ట్రాక్ కు గతంలో 3లక్షల రూపాయాలు మంజూరు అయిన విషయం తెలిసిందే. కాగా క్రీడ మైదానంలో నడకదారుల సమస్యలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి



తీసుకపోయి... ఇవి కాకుండా ట్రాక్ కొరకు అదనంగా నిధులు కొరకు మున్సిపాలిటి నుండి ఖర్చుపెట్టుకు బాద్యత తీసుకుంటామని చైర్మన్ వడ్లూరి సరిత, వైస్ చైర్మేన్ పెరుమండ్ల మానస ప్రకటించారు.సమస్యలపై స్పందించి తీరుస్తామని మున్సిపాలిటి పాలకవర్గం ప్రకటించినందుకు వాకర్స్ క్లబ్ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షులు గుర్రం సంజీవరెడ్డి, కమిటి సభ్యులు ప్రధాన కార్యదర్శి దండె లింగన్న, కోశాదికారి దూస రాము, ఉపాధ్యక్షులు మహేశుని మల్లేశం, యేలిగేటి సురేష్, సంయూక్త కార్యదర్శి సిరిపురం తిరుపతి, మొలుమూరి రమేష్, కమిటి సభ్యులు కాసం శ్రీనివాస్, యెన్నం లహరి, సిరిపురం ఆనందం, చీకట్ల కుమార్, తొడుపునూరి లక్ష్మయ్య, మంచికట్ల విఠల్, ఎలిగేటి నాగరాజు, బొద్దుల కిషన్, మరియు క్లబ్ సభ్యులు కోడూరి క్రిష్ణమూర్తి, పెద్ది లక్ష్మీకాంతం, కోటగిరి అజయ్, గర్షకూర్తి భీమయ్య, నర్సింహరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మామిండ్లవాడలో పారిశుద్ధ్య పనులు

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని మామిండ్లవాడలోని 17వ వార్డులో బుధవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించినట్లు 17వ వార్డు కౌన్సిలర్ ఎండి. ఖాలీక్ హుస్సేన్ అన్నారు. 17వ వార్డులోని పలు వీధుల్లో రోడ్డు పక్కన ఉన్న చెత్త, పిచ్చి చెట్లను జెసిబి సహాయంతో తొలగించి శుభ్రం చేయిం చినట్లు ఆయన తెలిపారు. జమ్మికుంట రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ ముసబ్ అహ్మద్, సానిటరీ ఇన్స్పెక్టర్ బి. కిరణ్, ఎన్విరాన్ మెంట్ అధికారి వినయ్ తదితరులు పరిశీలించారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత

**సూర్య కరీంనగర్**




కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గొల్లపల్లి గ్రామం సుల్తానాబాద్ మండలానికి చెందిన దాసరి సంపత్ అనునతడు తన ట్రాక్టర్ నందు అక్రమంగా మానేరువాక నుండి ఇసుకను దొంగలించి రవాణా చేస్తుండగా బొమ్మకల్ గ్రామంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పార్టీ ట్రాక్టర్లు సీజ్ చేసి నిందితుడుపై కేసు నమోదు చేసి తదుపరిచర్య నిమిత్తం కోర్టుకు పంపనైనది. ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## భూంరెడ్డి పెద్దకర్మలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

**సూర్య - ఎలిగేడు**

ర్యాకల్ దేవ్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డ్ సభ్యుడు గోపు శ్రీనివాస్ రెడ్డి తండ్రి భూంరెడ్డి పెద్దకర్మ కార్యక్రమానికి పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి బుధవారం హాజరై ఘననివాళులు అర్పించారు. భూంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూ తిని తెలియజేశారు.ఈ కార్యక్ర మంలో మండల పార్టీ అధ్యక్షులు బైరెడ్డి రాం రెడ్డి,మాజీ ఉప సర్పం చ్ అనిల్,నరేష్ గుడి కందుల, రాజేశం, బద్దం తిరుపతి రెడ్డి, న్యాథరీ పోచాలు,బాసంపల్లి వినోద్,సదయ్య,నారాయణ,మల్లారెడ్డి, మదుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.



## 64వ డివిజన్‌లో హోళీ సంబరాలు

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ పట్టణంలోని గీతా భవన్ చౌరస్తా వద్ద 64వ డివిజన్ కార్పొరేటర్ పడాల శ్రీజ అజయ్ ఆధ్వర్యంలో హోళీ సంబరాలు ఘనంగా నిర్వహించబడినవి.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అంజన్ కుమార్, 64 వ డివిజన్ కార్పొరేటర్ పడాల శ్రీజ అజయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పొన్నం సత్యం, పడాల అజయ్, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే 64వ డివిజన్ ప్రముఖులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహంగా రంగులు చల్లుకుంటూ హోళీ సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల మధ్యే ఉంటూ పండుగలు, సామాజిక కార్యక్రమాల ద్వారా ప్రజలతో అనుబంధాన్ని మరింత బలపరుస్తుందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం మరియు డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

## పారా క్వాట్ విషప్రయోగంపై తక్షణ చర్యలు తీసుకోవాలి

**- HRDA డిమాండ్**

**సూర్య కరీంనగర్**

దేశవ్యాప్తంగా పెరుగుతున్న పారా క్వాట్ విషప్రయోగం కేసులపై Healthcare Reforms Doctors Association (HRDA) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్రం, తెలంగాణ సహా రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ విధానపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది.ఎ=ణూ సీనియర్ ప్రతినిధి, క్రిటికల్ కేర్ నిపుణుడు డా. బండారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ పారా క్వాట్ విషప్రయోగం కేసులు ఆసుపత్రుల్లో పెరుగుతున్నాయని తెలిపారు. ఈ విషం వల్ల ఊపిరితిత్తుల ఫైబ్రోసిస్, కిడ్నీ దెబ్బతినడం, మల్టీ ఆర్గన్ ఫెయిల్యూర్ వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. స్పష్టమైన ప్రతివిషం లేకపోవడం చికిత్సను క్లిష్టతరం చేస్తోందని చెప్పారు.పారా క్వాట్ సులభంగా అందుబాటులో ఉండటం ప్రజారోగ్యానికి ముప్పుగా మారిందని, దీనిపై సమగ్ర అధ్యయనం కోసం జాతీయ స్థాయి ఉన్నత కమిటీ ఏర్పాటు చేయాలని HRDA డిమాండ్ చేసింది. ప్రజారోగ్య రక్షణకు తక్షణ చర్యలు అవసరమని సంఘం పిలుపునిచ్చింది.

## ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చు

**- ధనపురి సాగర్**

**సూర్య కరీంనగర్ టౌన్**




హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ 16వ డివిజన్ మల్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 19 మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేయడం జరిగిందని సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా సాగర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్షలను పండుగలాగా భావించాలని, కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చునని, ఇతర విద్యార్థులతో పోల్చుకోకుండా, ఒత్తిడిని జయిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. అలాగే ప్రశ్నపత్రంను మూడు నాలుగు సార్లు చదివి అర్థం చేసుకొని సమాధానం రాయడానికి పూనుకోవాలని సూచించారు. రాబోవు వార్షిక పరీక్షలో ఏ విద్యార్థి అయితే 555పై మార్కులు సాధిస్తారు వారికి సంస్థ పక్షాన 2016 నగదు పారితోషికం అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భీమేష్ సంస్థ సభ్యులు శ్రీధర్ రెడ్డి,ఖ.మన్ సాయి, హిమ సాయి, టి.శ్రీరామ్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా సంఘం ఆధ్వర్యంలో కంటి క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆశ్రిత్ అనే చిన్నారికి ఆర్థిక సహాయం అందజేశారు. నవీన-అనిల్ దంపతుల కుమారుడైన ఆశ్రిత్ చికిత్సకు సుమారు రూ.5 లక్షలు అవసరమవుతుండగా, సంఘం తరపున రూ.4,000 సహాయం చేశారు.ఈ సందర్భంగా చిన్నారి చికిత్సకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించాలని మహిళా సంఘం అధ్యక్షురాలు చకిలం స్వప్న శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో రేఖ, గరేపల్లి రాణి పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్ - బోయినపల్లి ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం ఆకస్మిక తనిఖీ**

**- తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ**

**సూర్య, బోయినపల్లి..**

వైద్యులు, సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బోయినపల్లి ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలో కలె క్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందు గా ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్, వ్యాక్సిన్లు, ఓపీ రిజిస్టర్ పరిశీలించి.. సూచనలు చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు.రోజు ఎంత మంది పేషెం ట్లు వస్తున్నారో అని అడిగి తెలుసు కున్నారు. గర్భిణుల రిజిస్ట్రేషన్, టీకాలు, మందుల పంపిణీపై ఆరాతీశారు. పలువురు పేషెంట్లతో మాట్లాడి .. వారి ఆనారోగ్య సమస్యను తెలుసు కున్నారు. పీ హెచ్‌సీ పరిధిలో కొత్తగా, ఇప్పటికే మొదలు పెట్టిన హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణాల పురోగతిపై



వైద్యాధికారిని ఆరా తీశారు. వాటి పై అధికారులతో మాట్లాడి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది నిత్యం సమయానుసారంగా అందుబాటులో ఉండాలని సూచించారు. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు తెలియజేయాలని పేర్కొన్నారు.

**- తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలన**

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, భూ భారతి రిజిస్ట్రేషన్ గది, కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.కార్యాలయానికి వచ్చే వారికి సేవలు అందించాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి అందుబాటులో ఉండాలని ఎప్పటికప్పుడు రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేసారు. ఇక్కడ తహసీల్దార్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ 'రంగు'

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్- ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు**

**సూర్య, వేములవాడ**

వేములవాడలో బుధవారం హోలీ పండుగ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. కుల మతాలకు అతీతంగా పట్టణ ప్రజలం దరూ ఒకరిపై ఒకరు రంగులు చల్లు కుంటూ స్నేహభావాన్ని చాటుకున్నారు. ఈ వేడుకల్లి విప్ ఆది శ్రీనివాస్ ప్రజలతో కలిసి సందడి చేశారు. తన నివాసంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. మహిళలు, కార్మికులు ఆయనకు రంగులు పూసి శుభాకాంక్షలు తెలుపగా, ఆయన వారందరితో కలిసి ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ హోలీ



విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ హోలీ పండుగ మన సంస్కృతిలో ఐక్యత, సౌభ్రాతృత్వం, ఆనందాన్ని ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇది అజ్ఞానం అనే చీకటిని పారద్రోలి, జ్ఞానమనే వెలుగును నింపే పర్వదినమని, చెడుపై మేలుకు లభించిన గెలుపునకు నిదర్శనమని తెలిపారు. ప్రజలు పర్యావరణానికి హాని కలగని సహజ రంగులతో, సురక్షితంగా పండుగ జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పురాణాల ప్రకారం హోలీక అనే రాక్షసి సంహారం జరిగిన గుర్తుగా ఈ వేడుకను జరుపుకోవడం మన ప్రాంతంలో ఆనవాయితీగా వస్తోందని చాటి చెప్పారు. ఈ వేడుకల్లో స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని హోలీని రంగులమయం చేశారు.

# దేశరాజు పల్లిలో పండగపూట విషాదం..

**- హోలీ వేడుకల్లో అపశృతి...**

**- ఈతకు వెళ్లి కెనాల్‌లో పడి మృతి.**

**సూర్య రామడుగు**

రామడుగు మండలం దేశరాజు పల్లి గ్రామంలో హోలీ పండుగ పూట విషాద నెలకొంది. వివరాలలోకి వెళితే రామడుగు మండలం దేశరాజుపల్లి గ్రామానికి చెందిన వరాల రాకేష్ 23 అనే యువకుడు కొంతమంది యువకులతో కలిసి బుధవారం ఉదయం హోలీ వేడుకల్లో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మోతే వాగు సమీపంలోని కొక్కెరకుంట శివారులో ఉన్న ఎస్సారెస్పీ కెనాల్ లో స్నేహితులతో కలిసి



ఈత కొట్టేందుకు కెనాల్ లో దూకారు. రాకేష్ కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. తోటి స్నేహితుల కళ్లెదుటే నీటిలో రాకేష్ మునిగిపోయినప్పటికీ ఎవరు కూడా కాపాడలేకపోయారు. అప్పటివరకు హోలీ సంబరాల్లో స్నేహితులతో కలిసిఆనందంగా గడిపిన కొద్ది క్షణాల్లోనే తోటి మిత్రుడు అనంత లోకాలకు వెళ్లడంతో రాకేష్ లేడనే వార్త స్నేహితులు జీర్ణించుకోలేకపోతున్నారు. వెంటనే ఈ సమాచారాన్ని కుటుంబ సభ్యులకు అందించడంతో స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి రాకేష్ మృతదేహాన్ని గజ ఈత గాళ్ళతో వెలికి తీశారు. రాకేష్ తండ్రి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అల్లరి ముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కొడుకు హోలీ సంబరాలు జరుపుకొని కెనాల్ లో శవమై తేలడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. మృతదేహంనుకరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

## కమాన్‌పూర్ మండలంలో యువకుడు అనుమానాస్పద మృతి

**- సింగరేణి అవుట్‌సోర్సింగ్ కార్మికుడి మృతదేహం గుర్తింపు**

**సూర్య, సెంటినరీ కాలనీ**

కమాన్‌పూర్ మండలం: మండలంలోని పేరపల్లి గ్రామానికి చెందిన చెప్యాల దేవేందర్ (38) అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, దేవేందర్ ఆదివారం రాత్రి సుమారు 10.00 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆ తర్వాత తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన



చెందారు. దేవేందర్ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆర్జీ-3 పరిధిలోని సెంటినరీ కాలనీలోని నర్సరీ లో అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నాడు. రోజూ విధులకు హాజరవుతూ కుటుంబాన్ని పోషిస్తున్న దేవేందర్ అకస్మాత్తుగా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఆయన మృతదేహం గుర్తించబడింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు. దేవేందర్‌కు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న దేవేందర్ మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బంధువులు, గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపట్టినట్లు సమాచారం.

## లాడ్జిలో యువకుడి అనుమానాస్పద మృతి

**సూర్య, వేములవాడ**



వేములవాడ పట్టణంలో ఓ లాడ్జిలో యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. లాడ్జి నిర్వాహకురాలు తెలిపిన వివరాల ప్రకారం, యువకుడు ఉన్న గదిలోకి సుమారు 20 ఏళ్ల యువతి, ఒక వృద్ధుడు వెళ్లినట్లు సమాచారం. కొద్ది సేపటికే వారు ఇద్దరూ కంగారుగా గది నుంచి బయటకు వెళ్లిపోవడంతో అనుమానం వచ్చిన నిర్వాహకురాలు గదిలోకి వెళ్లి పరిశీలించగా, యువకుడు మృతి చెంది ఉండటం గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బాలిక ఆత్మహత్య

**సూర్య, ధర్మపురి:**

ప్రేమించిన వ్యక్తి పెళ్లికి నిరాకరించడంతో బాలిక ఆత్మహత్య ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ధర్మపురి మండలంలో చోటుచేసుకుంది. ధర్మపురి ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా ధర్మపురి మండలానికి చెందిన బాలిక (17) జగిత్యాల జిల్లాలోని ఒక జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతోంది. జగిత్యాలలో నివాసం ఉండే కోల మనోజ్ (22) అనే యువకుడు ఆ బాలికని ప్రేమ పేరిట వెంట పడుతూ వేధిస్తూ పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి శారీరకంగా వాడుకున్నాడు . కొన్ని రోజుల తర్వాత అతడు పెళ్లికి నిరాకరిస్తూ నేను పెళ్లి చేసుకోను చస్తే చావు అని ఆమెని బెదిరించాడు. దాంతో తీవ్ర మనస్థాపానికి గురైన బాలిక 8 డిసెంబర్ 2025 న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు జగిత్యాల లోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో డాక్టర్ ల సలహా మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాదులోని యశోద హాస్పిటల్ కి తరలించినారు. ఆ బాలిక చికిత్స పొందుతూ ఈ నెల 3 న మృతి చెందినది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కోరుట్లలో పోలీసులపై దాడి

**- నలుగురిపై కేసు నమోదు**

**సూర్య కోరుట్ల**

పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులపై కొందరు యువకులు దాడికి పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది.మార్చి మూడు రాత్రి సుమారు 11 గంటల సమయంలో కోరుట్ల హెడ్ కానిస్టేబుల్ లింబాద్రి, కానిస్టేబుల్ గంగాధర్ పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో భీముని దుబ్బ సమీపంలో కొంతమంది వ్యక్తులు డీజే ఏర్పాటు చేసి గట్టిగా సంగీతం వినిపిస్తూ డ్యాన్స్ చేస్తున్నట్లు సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు డీజే ఆఫ్ చేయాలని, అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. అయితే వారు పోలీసుల మాట వినకుండా అదే విధంగా డ్యాన్స్ చేస్తూ ఉండగా, పరిస్థితిని రికార్డు చేయడానికి హెడ్ కానిస్టేబుల్ లింబాద్రి తన మొబైల్ ఫోన్‌తో వీడియో తీయడం ప్రారంభించారు. ఈ క్రమంలో కోరుట్లకు చెందిన గడల విజయ్, డీజే రమేష్, దినకర్, మహేందర్ అనే నలుగురు వ్యక్తులు కలిసి హెడ్ కానిస్టేబుల్ ఫోన్‌ను లాక్కొని నేలపై పడవేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక, ఫోన్ తిరిగి తీసుకునేందుకు ప్రయత్నించిన కానిస్టేబుల్ గంగాధర్‌ను కాలర్ పట్టుకుని నెట్టివేసి, వారి విధుల్లో ఆటంకం కలిగించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. హెడ్ కానిస్టేబుల్ లింబాద్రి ఫిర్యాదు మేరకు పై నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై ఎం. చిరంజీవి తెలిపారు.

## ఆరేపల్లి శివారులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ రూరల్ మండలం ఆరేపల్లి గ్రామ శివారులోని సత్యనేని తిరుపతి పత్తి చేనులో సుమారు 60 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైంది.మృతుడు తెల్లని గడ్డం కలిగి ఉండి, తెల్లని బనియన్, తెల్లని ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తుపట్టిన వారు లేదా ఆచూకీ తెలిసిన వారు కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.సంప్రదించవలసిన ఫోన్ నంబర్: 87126 70764 సీఐ ఏ. నిరంజన్ రెడ్డి, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, కరీంనగర్ రూరల్.

# నల్లగొండలో రయ్ రయ్ మన్న బండ్లు.. ఆధ్యాత్మిక శోభతో 'శకటోత్సవం'



**సూర్య, తిమ్మాపూర్**

తిమ్మాపూర్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నల్లగొండ శ్రీ సీతారామ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం భక్తజన సంద్రమైంది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అత్యంత కీలకమైన శకటోత్సవం (బండ్ల ఊరేగింపు) బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా నలుమూలల నుంచే కాకుండా పక్క జిల్లాల నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలివచ్చారు.రైతులు తమ ఆరాధ్య దైవమైన నరసింహస్వామికి మొక్కులు చెల్లించుకోవడానికి పోటీపడ్డారు. తమ ఎడ్లబండ్లు, ట్రాక్టర్లను రంగురంగుల పూలతో, రకరకాల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వందలాది బండ్లు గుట్ట చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటే, భక్తులు భక్తిపారవశ్యంతో చేసిన "నరసింహస్వామి గోవిందా.. గోవిందా.." అనే నినాదాలతో నల్లగొండ గిరులు మారుమోగాయి. డప్పు చప్పుళ్లు, కోలాటాల నడుమ సాగిన ఈ ఊరేగింపు భక్తులకు కనువిందు చేసింది. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. తెల్లవారుజాము నుంచే స్వామివారికి విశేష అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి తమ కోర్కెలు తీర్చే"లక్ష్మీ నరసింహుడిని"దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ అన్ని సౌకర్యాలు కల్పించారు. ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు పంపిణీ చేయడంతో పాటు, ఎక్కడా ఇబ్బందులు కలగకుండా వాలంటీర్లు సేవలందించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పార్కింగ్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మొత్తానికి నల్లగొండ క్షేత్రం నరసింహ నామస్మరణతో భక్తిమయంగా మారింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఈవో, పాలక మండలి సభ్యులు మరియు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా లక్ష్మీనరసింహుడి రథోత్సవం

**- తరలివచ్చిన వేలాది భక్తులు**

**సూర్య వెల్గటూర్**

జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కిషన్ రావుపేట గ్రామంలోని శ్రీ నాగపెల్లి లక్ష్మీ నరసింహస్వామి ఐదు రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాల లో భాగంగా చివరిగా అత్యంత ప్రధాన ఘట్టం బుధవారం స్వామి వారి రథోత్సవం వైభవంగా కనుల పండువ గా ఘనంగా నిర్వహించారు.గుట్ట పైన ఉన్న లక్ష్మీ నరసింహస్వామి కి ప్రధాన అర్చకులు విష్ణు వర్ధన చార్యులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు అమ్మవార్ల ను పల్లకిలో కూర్చోబెట్టి భక్త జన సందోహం మధ్య గుట్ట పై నుంచి వేద పండితుల మంత్రోచ్చారణలు, సన్నాయి మేళాల మధ్య నరసింహ స్వామి నామ స్మరణతో గుట్ట క్రింది కి తీసుకవచ్చారు.హోమ కార్యక్రమాల తో ప్రత్యేక పూజలు నిర్వహించి,రంగురంగుల పూల మాలల తో అలకంరించిన రథంపై ఆశీనులు గావించారు. భక్తులు స్వామివారి రథశీ దగ్గర టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.భక్త జన సందోహం మధ్య జై శ్రీమన్నారాయణ నామ స్మరణతో భక్తులు పోటాపోటీగా రథాన్ని ముందుకు లాగుతూ రథోత్సవ కార్యక్రమన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

## రాములపల్లిలో ఘనంగా హోలీ సంబరాలు

**సూర్య- ఎలిగేడు**

మండలంలోని రాములపల్లి గ్రామంలో బుధవారం హోలీ పండుగను అత్యంత ఘనంగా నిర్వహించారు. గ్రామం అంతటా రంగుల సందడి నెలకొని, ఉత్సాహభరిత వాతావరణంలో ప్రజలు పండుగను ఆనందంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సిద్ధి తిరుపతి యాదవ్ గ్రామ యువకులు, మహిళలు, పెద్దలతో మమేకమై హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. గ్రామస్తులతో కలిసి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హర్షాతిరేకాలతో గడిపారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ సోదరభావాన్ని చాటారు. గ్రామ యువత హోలీ పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పిల్లలు రంగుల పొడులతో ఆడుకుంటూ పండుగను ఆస్వాదించారు. గ్రామంలో ఎక్కడ చూసినా రంగుల హరివిల్లులు కనిపించాయి. పండుగ సందర్భంగా గ్రామంలో ఐక్యత, స్నేహభావం మరింత బలపడిందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, యువకులు, మహిళలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొని హోలీ సంబరాలను విజయవంతం చేశారు.



## అఖిల భారత స్థాయిలో పైడిమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి మూడో బహుమతి

**సూర్య కరీంనగర్**




కోరుట్ల మండలంపైడిమడుగు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు పొందింది. 2024--25 సంవత్సరానికి గాను నేషనల్ ఫెడరేషన్ కొపరేటివ్ బ్యాంకు ఆధ్వర్యంలో, నెషనల్ బ్యాంకు ఆఫ్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్మెంట్ (నాబర్డ్) సిఫారసుతో నిర్వహించిన ఉత్తమ పనితీరు కనబరిచిన సహకార సంఘాల ఎంపికలో పైడిమడుగు సంఘం అఖిల భారత స్థాయిలో మూడో బహుమతిని దక్కించుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పనితీరు, ఆర్థిక నిర్వహణలో పారదర్శకత, రైతులకు అందించిన రుణాలు మరియు ఇతర సేవలను సమగ్రంగా పరిశీలించి ఈ అవార్డును ప్రకటించారు. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం ఈ నెల 17న గాంగ్టాక్ , సిక్కిం రాష్ట్రంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొని అవార్డును స్వీకరించనున్నారు.ఈ విజయంతో పైడిమడుగు సహకార సంఘానికి జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు లభించింది. సంఘ అభివృద్ధికి కృషి చేసిన పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, రైతు సభ్యుల సమిష్టి శ్రమ ఫలితమే ఈ ఘనతగా సంఘ ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులో కూడా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.

## సెస్ అవినీతిని నివారించాలంటే విలీనమే ఏకైక మార్గం

**సూర్య సిరిసిల్ల టౌన్**




సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ సెస్ లో 2026-27 సంవత్సరపు వార్షిక ఆదాయ, ఆవశ్యకత పై ఈఆర్ సి బృందం బహిరంగ విచారణ చేపట్టింది.సెస్ పరిధిలోని వినియోగదారులు తమ సమస్యలను ఈఆర్సికి వివరించారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో తెలంగాణ పిఆర్ సీ బుధవారం నిర్వహించిన బహిరంగ విచారణకు హాజరైన తెలంగాణ ఈఆర్సీ చైర్మెన్ డాక్టర్ జస్టిస్ డీ.నాగార్జున, కే.రఘు,ఈఆర్సీ టెక్నికల్ విభాగం సభ్యుడు సీ హెచ్ శ్రీనివాస్ రావు,ఈఆర్సీ ఫైనాన్స్ విభాగం సభ్యులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్చం అందజేసారు.అనంతరం జిల్లా సమీకృత కార్యాలయంలో జరిగిన బహిరంగ విచారణలో సెస్ సంస్థ వినియోగదారులకు ఎలాంటి సేవలందిస్తున్నారో సెస్ వారు వివరించారు. సెస్ మనుగడకు తీసుకుంటున్న చర్యల్ని సభ్యుల ముందు క్లుప్తంగా వివరించారు. అనంతరం వివిధ గ్రామాల నుండి హాజరైన సెస్ వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సెస్ సంస్థలు ట్రాన్స్కో విధానాలు అమలవుతున్నప్పుడు ఈ సంస్థను ట్రాన్స్ కో లో ఎందుకు విలీనం చేయడం లేదో ప్రశ్నించారు.పాలకవర్గం నిర్ణయాల వల్ల అనేక సమస్యలతో ముందుకు సాగుతుందని ఇది భరించే ఓపిక వినియోగదారులకు లేదని వెంటనే సెస్ సంస్థను ట్రాన్స్కో లో విలీనం చేయాలని పలువురు డిమాండ్ చేశారు.పాలకవర్గం ఉండడం వల్ల అనేక అవినీతి అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని వీటన్నిటిని నియంత్రించాలంటే ఈ సంస్థను విలీనం చేయడమే ఏకైక మార్గమని అన్నారు.

## కొడిమ్యాలలో రంగుల హోలీ సంబరాలు

**సూర్య కొడిమ్యాల**



కొడిమ్యాల గ్రామంలో హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో సర్పంచ్ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో యువత హోలీ సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు.రంగుల పండుగగా పేరుగాంచిన హోలీ సందర్భంగా యువకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరికి ఒకరు రంగులు చల్లి ఆనందాన్ని పంచుకున్నారు. స్నేహభావం, ఐక్యతకు ప్రతీకగా హోలీ పండుగను జరుపుకోవడం విశేషంగా నిలిచింది.ఈ సందర్భంగా సర్పంచ్ జీవన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ ఐక్యంగా ఉండాలని, పండుగలను సామరస్య వాతావరణంలో జరుపుకోవడం ఆనందదాయకమని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

## లైన్ మెన్ దినోత్సవం...అందరికి సన్మానం

**- వినియోగదారులకు సేవలు అందించాలి - ఏఈ కోరండ్ల**

**సూర్య, సెంటినరీ కాలనీ**



విద్యుత్ సంస్థలో లైన్ మెన్ దినోత్సవం సందర్భంగా బుధవారం రామగిరి మండలం రత్నాపూర్ సబ్ స్టేషన్ లోని సెక్షన్ ఆఫీస్ లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామగిరి విద్యుత్ ఏఈ కోరండ్ల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులకు సేవలు అందించడమే మన ప్రథమ కర్తవ్యం అన్నారు. ప్రభుత్వం, ఎన్పీడీసీఎల్ సంస్థ గ్రామాలలో లో వోల్టేజ్ సమస్య లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తుందన్నారు. ఈ సందర్భంగా రామగిరి పరిధిలోని ఉద్యోగులందరినీ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ కుమ్మరికుంట సతీష్,సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ ఉడుత భూమయ్య, నవీన్ కుమార్, లైన్ మెన్ లు బంగారి శివ కుమార్, ఆకుల శ్రీనివాస్, వడ్లకొండ రమేష్, రాజేందర్, ఏఎల్ఎం లు తిప్పిరిశెట్టి రమేష్, ఈశ్వరోజు ప్రభాకర్, కందుల అంజయ్య, కృష్ణమాచారి, బండి శ్రీనివాస్, రాకేష్ వర్మ, జె.రాజ్ కుమార్, ఆపరేటర్ లు గుజ్జుల శ్రీనివాస్, వీరగోని రాజశేఖర్, ఆన్ మ్యాన్ లు గుండ చందు, వేగోళపు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ లకు ఖాకీ యూనిఫాం అందచేయాలి

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి సంస్థ భూపాలపల్లి డివిజన్ లో పనిచేసే ప్రైవేట్ సెక్యూరిటీ కార్మికులకు యాజమాన్యం ఖాకీ యూనిఫాం ఇవ్వాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థలో ప్రైవేటు సెక్యూరిటీ కార్మికులకు వివిధ కాంట్రాక్టర్స్ మారినప్పుడు వారి యొక్క డ్రెస్ కోడ్ తో రకరకాల యూనిఫామ్ ఇవ్వడం జరుగుతుందని, దీనివల్ల కాంట్రాక్టు కార్మికులు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు విధి నిర్వహణలో దొంగలు కూడా వారిని చూసి భయపడే పరిస్థితి లేదని తెలిపారు. కాబట్టి ఈ కార్మికులకు ఖాకి యూనిఫామ్ అందరికీ అమలయ్యే విధంగా సింగరేణి యాజమాన్యం ఒక నిర్ణయం తీసుకొని ఈ కార్మికులందరికీ ఖాకీ యూనిఫాం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మారం రామ్ రెడ్డి, మేకల సతీష్, జిట్టవేణి శంకర్, జోరు నరేష్, జిట్టవేణి సదయ్య, కే.కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసిన కౌన్సిలర్ బత్తుల నరేష్

**సూర్య మెట్‌పల్లి:-**



పట్టణ మూడవ వార్డు కౌన్సిలర్ బత్తుల నరేష్ రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామిని బుధవారం కలిశారు. కౌన్సిలర్‌గా విజయం సాధించిన తర్వాత మొదటిసారి హైదరాబాద్ లోని మంత్రి కార్యాలయానికి వెళ్లిన ఆయన, మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్ గా ఎన్నికైన నరేష్ కు మంత్రి వివేక్ వెంకటస్వామి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు నమ్మకంతో గెలిపించినందుకు, నిరంతరం ప్రజల చెంతనే ఉంటూ వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మెట్‌పల్లి పట్టణ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు.వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు మంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల కౌన్సిలర్ బత్తుల నరేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ రక్షక దళ్ అధ్యక్షులు రెంజర్ల రాజేష్, ఎన్నం రమేశ్, తరాల్ల కార్తీక్, బిట్లుగు కార్తీక్, దుర్గం సిద్దార్థ, రామ్మూర్తి, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

# పోస్టాఫీసులో 15 నెలలుగా కొనసాగు...తున్న విచారణ

## - బాధితులను పిలుచుకొని వివరాలు సేకరించిన ఇన్స్పెక్టర్లు

**సూర్య, సెంటినరీ కాలనీ**

సెంటినరీ కాలనీ పోస్టాఫీసు లో బుధవారం గోదావరిఖని పోస్టల్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి, జమ్మికుంట పోస్టల్ ఇన్స్పెక్టర్ మోహన్ లు విచారణ జరిపారు. గతంలో బేగంపేట, సెంటినరీ కాలనీ పోస్టాఫీసు లో డిపాజిట్లు, ప్రతి నెల పొదుపు డబ్బులు కిసాన్ వికాస్ పత్రం (కెవిపి), సుకన్య పథకం కింద డబ్బులు జమ



కాలేదు. దీనిపై అప్పట్లో దుమారం లేచింది. సెంటినరీకాలనీ-బేగంపేట కలుపుకుని సుమారు రూ. కోటి అవినీతి జరిగింది. 2024 సెప్టెంబర్,అక్టోబర్ నెలలో ఈ అవినీతి జరిగింది. అప్పటి నుంచి విచారణ కొనసాగు... తుంది. బాధితులు పోస్టాఫీసు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఈ క్రమంలో కొంతమంది బాధితులను పిలుచుకొని గోదావరిఖని పోస్టల్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి, జమ్మికుంట పోస్టల్ ఇన్స్పెక్టర్ మోహన్ లు



విచారణ జరిపారు. గత 15 నెలలుగా డబ్బులు ఎందుకు అందడం లేదని బాధితులు పోస్టాఫీసు ముందు ఆందోళన చేశారు. తాము ఎంతో కష్టపడి పోస్టాఫీసు ను నమ్మి డబ్బులు పెడితే తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆందోళన చేశారు. తమ జీవితాలతో అడ్డుకోవద్దని ఇన్స్పెక్టర్లను కోరారు. తాము రిపోర్ట్ ఉన్నతాధికారులకు అందించామని అధికారులు "సూర్య"కు వివరణ ఇచ్చారు.

# కుల బహిష్కరణ చేసిన సంఘ అధ్యక్షుడిపై కేసు నమోదు

**సూర్య, చందుర్తి**

చందుర్తి మండలం ననుగుల గ్రామానికి చెందిన మారు శశిపాల్ రెడ్డి తండ్రి సుధాకర్ రెడ్డి కుటుంబాన్ని కుల బహిష్కరణ చేసి, మానసికంగా వేధింపులకు గురిచేసిన సంఘ అధ్యక్షుడు పోతుగంటి శ్రీనివాస్ పై కేసు నమోదు చేసినట్లు ఒక ప్రకటనలో చందుర్తి ఎస్ఐ జె రమేష్ తెలిపారు. ఫిర్యాదుదారుడైన మారు శశిపల్ రెడ్డికి 2020 సంవత్సరంలో రామారావు పల్లి గ్రామానికి చెందిన అలేఖ్యతో వివాహం కాగ వారి మధ్యలో మనస్పర్ధలు కారణంగా పలుమార్లు పంచాయతీ నిర్వహించగా అట్టి పంచాయతీ గాను సంఘ అధ్యక్షుడు పోతుగంటి శ్రీనివాస్ రెండు లక్షల దదవత్తు తీసుకోగ, అట్టి పంచాయతీ పరిష్కారం కానందున ఫిర్యాదుని భార్య కుటుంబం వారు కోర్ట్ ను సంప్రదించగా కోర్టు లో కేసు నమోదు అయ్యింది కాబట్టి పిర్యాది దారుడు దదవత్ రెండు లక్షలు ఇవ్వమని సంఘ అధ్యక్షుని అడగగా, సంఘ అధ్యక్షుడు పోతుగంటి శ్రీనివాస్ డబ్బులు ఇవ్వను ఏం చేసుకుంటావో చేసుకో అని చెప్పి సంఘం నుండి బహిష్కరించినట్లు తెలిపినాడని గత నెల 27న అదే గ్రామానికి చెందిన ఫిర్యాది దారుని సంఘ సభ్యుడి కుమారుని ఎంగేజ్మెంట్ కి పిలిచినందుగాను వారికి 5000వేల రూపాయలు జరిమానా విధించినట్లు శశిపాల్ రెడ్డి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చందుర్తి ఎస్సై జె.రమేష్ తెలిపారు.

# రోడ్డు ప్రమాద బాధితులను కాపాడితే "రాహ్ వీర్" పథకం ద్వారా 25 వేల పారితోషికం:

## - జిల్లా ఎస్పీ అశోక్ కుమార్.

**సూర్య, జగిత్యాల**

రోడ్డు ప్రమాదాల సమయంలో గాయపడిన వారికి తక్షణ సహాయం అందించి వారి ప్రాణాలను కాపాడే బాధ్యతగల పౌరులను "గుడ్ సమారిటన్స్" ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "రాహ్ వీర్ పథకం" ద్వారా 25 వేల రూపాయల నగదు పారితోషికం , ప్రశంసా పత్రం అందజేయబడుతుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.



దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రమాదం జరిగిన తొలి గంటను "గోల్డెన్ అవర్"గా పరిగణిస్తారని ఈ సమయంలో బాధితులకు సమయానికి వైద్య సహాయం అందితే అనేక ప్రాణాలను రక్షించవచ్చని పేర్కొన్నారు. కొంతమంది పౌరులు పోలీస్ కేసులు ఉంటాయన్న భయంతో గాయపడిన వారికి సహాయం చేయడానికి వెనుకంజ వేస్తున్నారని ఈ భయాలను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం "రాహ్ వీర్" పథకం ను అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం ప్రకారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి ప్రాణాలను కాపాడిన వారికి ప్రభుత్వం నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసా పత్రం అందజేస్తుంది. సహాయం చేసిన వ్యక్తిపై ఎలాంటి చట్టపరమైన ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్ సేవలకు సమాచారం ఇవ్వాలని, సమీపంలోని ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రికి గాయపడిన వారిని తరలించాలని సూచించారు. ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి ప్రాణాలను కాపాడే కార్యక్రమంలో భాగస్వామి కావాలని కోరారు.

# జయీభవ విజయీభవ 2.0 పోస్టర్ విడుదల

## - విద్యార్థులకు మార్గదర్శక సూచనలు

**సూర్య, కోరుట్ల**

కోరుట్ల పట్టణంలోని కల్లూరు రోడ్డులో గల పియం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో "జయీభవ



విజయీభవ 2.0" పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. కోరుట్ల మండల విద్యాధికారి గంగుల నరేశం పోస్టర్‌ను విడుదల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ రూపొందించిన "పంచ సోపానాలు" ఫాంప్లెట్లను విద్యార్థులకు పంపిణీ చేసి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన సూచనలు వివరించారు.పరీక్షల సమయంలో సమయపాలనతో కూడిన ప్రణాళికాబద్ధమైన చదువు ఎంతో ముఖ్యమని తెలిపారు. శారీరక ఆరోగ్యం కోసం పోషకాహారం తీసుకోవాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ప్రతిరోజూ వేకువజామున లేచి యోగా చేయడం, పూర్వ ప్రశ్నాపత్రాలను సాధన చేయడం అవసరమని పేర్కొన్నారు.ప్రశ్నాపత్రాన్ని పూర్తిగా చదివి అర్థం చేసుకుని ప్రశ్నలకు అనుగుణంగా సమాధానాలు రాయాలని, చక్కటి రాతతో విరామ చిహ్నాలు పాటిస్తూ పాయింట్ల వారీగా సమాధానాలు ఇవ్వాలని సూచించారు. వినయ విధేయతలు కలిగి తల్లిదండ్రులు, గురువులు చెప్పిన మంచి మాటలను పాటిస్తూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.కష్టపడే తత్వం, పట్టుదల, నమ్మకం, శ్రమతో పదవ తరగతిలో ఉన్నత శ్రేణి ఫలితాలు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. గంగాధర్, ఉపాధ్యాయులు సిహెచ్ కృష్ణ మోహన్ రావు, ఎండి అబ్దుల్ రవూఫ్, కె. శ్రీనివాస్, సిఆర్పి పి. గంగాధర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలకు శ్రీకారం

## - అండగా శ్రీనివాసుల సేవా సంఘం

**సూర్య, తిమ్మాపూర్**

ఉమ్మడి కరీంనగర్ శ్రీనివాసుల సేవా సంఘం ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట, నేదునూరు గ్రామాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు వినూత్నంగా అండగా నిలిచారు. చిలుకూరి బాలాజీ శివాలయం ప్రధాన అర్చకులు సురేష్ ఆత్మారాం మహారాజ్ బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పెన్నులను విద్యార్థులకు పంపిణీ చేశారు. రాబోయే పరీక్షల్లో విద్యార్థులు చక్కగా రాణించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో రేణికుంట 1వ వార్డు సభ్యులు తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ కుంభం శ్రీనివాస్, బూట్ల శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. సేవా సంఘం చేస్తున్న ఈ కృషిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.



# అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీ చేసిన సర్పంచ్

## - చైర్‌పర్సన్‌గా సర్పంచ్ కప్పల ప్రవీణ్

**సూర్య - ఎలిగేడు**



ఎలిగేడు మండల కేంద్రంలోని ఎలిగేడు--1 అంగన్వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణీ స్త్రీలు, బాలింతలు చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్ పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పౌష్టికాహారం అందజేశారు.అనంతరం చిన్నారుల బరువులను తూచి ఆరోగ్య స్థితిని పరిశీలించారు. అలాగే కొత్త ఏ ఎల్ ఎం ఎస్ సి కమిటీ సమావేశాన్ని నిర్వహించి, కమిటీ చైర్‌పర్సన్‌గా సర్పంచ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ అంగన్వాడీ భవనం మంజూరుకు ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సహకారంతో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు జ్యోతి, సరోజ, సరస్వతి, ఆశ పద్మతో పాటు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

# సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవానికి గోటితో తలంబ్రాలు

**సూర్య, సెంటినరీ కాలనీ**



భద్రాచలంలో ఈ నెల 27న నిర్వహించబోయే సీతారామ చంద్రస్వామి కళ్యాణోత్సవానికి సాంప్రదాయబద్ధంగా గోటితో ఒలిచిన తలంబ్రాలను పంపించి రామభక్తులు తమ భక్తిని చాటుకుంటారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఈ.వెంకట్ రావు సూచనల మేరకు లోక కళ్యాణం కోసం శ్రీరామనవమి సందర్భంగా జరిగే వేడుకల్లో భాగంగా గోటి తోని తలంబ్రాలు తీయుట, పసుపు కొమ్ములు దంచుట, తలంబ్రాలు కలుపుట కార్యక్రమాన్ని కలవచర్ల బస్టాండ్ వద్ద గల సాయి నిలయంలో మహిళలు ఆకుపచ్చ చీరలు ధరించి పురుషులు తెలుపు వస్త్రాలు, స్కార్ఫ్ ధరించి భగవన్నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. కలవచర్ల శ్రీ సత్య సాయి భజన మండలి కన్వీనర్ నూక రమేష్-వాణి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేండ్ల శారద, ఆలయ కమిటీ చైర్మన్ రేండ్ల కుమారస్వామి, రామిడి వెంకటేశ్వర్లు-సుజాత, కొండ సమ్మయ్య- కనకమ్మ, భాస్కర్- స్వరూప, తాటిపాముల శ్రీనివాస్ -రాజ్యలక్ష్మి, పుల్లూరి అన్వేష్ - మణిదీపిక, గుండా శంకరయ్య-జయప్రద, పల్లెర్ల శ్రీధర్-సరిత దంపతులతో పాటు గుండా కవిత, గుండా పద్మ శ్రీనివాస్, కొమురవెల్లి జయసుధ, కొత్త పద్మ - వరలక్ష్మి, బండి రమాదేవి, గసిగంటి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అఖిల భారత స్థాయిలో పైడిమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి మూడో బహుమతి

**సూర్య, కోరుట్ల రూరల్**



మండలంపైడిమడుగు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు పొందింది. 2024--25 సంవత్సరానికి గాను నేషనల్ ఫెడరేషన్ కోఆపరేటివ్ బ్యాంకు ఆధ్వర్యంలో, నేషనల్ బ్యాంక్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్) సిఫారసుతో నిర్వహించిన ఉత్తమ పనితీరు కనబరిచిన సహకార సంఘాల ఎంపికలో పైడిమడుగు సంఘం అఖిల భారత స్థాయిలో మూడో బహుమతిని దక్కించుకుంది.దేశవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పనితీరు, ఆర్థిక నిర్వహణలో పారదర్శకత, రైతులకు అందించిన రుణాలు మరియు ఇతర సేవలను సమగ్రంగా పరిశీలించి ఈ అవార్డును ప్రకటించారు.అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం ఈ నెల 17న గాంగ్టాక్ , సిక్కిం రాష్ట్రంలో నిర్వహించ నున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొని అవార్డును స్వీకరించనున్నారు.ఈ విజయంతో పైడిమడుగు సహకార సంఘానికి జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు లభించింది. సంఘ అభివృద్ధికి కృషి చేసిన పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, రైతు సభ్యుల సమిష్టి శ్రమ ఫలితమే ఈ ఘనతగా సంఘ ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులో కూడా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.

# హోలీ వేడుకలలో వాలీబాల్ టీమ్

**సూర్య, సెంటినరీ కాలనీ**



సెంటినరీ కాలనీ రాణి రుద్రమదేవి స్టేడియంలో బుధవారం హోలీ వేడుకలు జరిగాయి. వాలీబాల్ క్రీడాకారులు వేడుకలను నిర్వహించారు. రంగులు పూసుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పీవీరావు, డాక్టర్.బొద్దుల జగదీశ్వర్, తీగల సమ్మయ్య, నల్లవెల్లి శంకర్, ఏకు విజయ్, భోగే సతీష్, బూరుగు రాజు, పత్తి దామోదర్, తన్నీరు ప్రదీప్, సందే. ప్రణయ్,అవునూరి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# 108 కలశాలతో మహాభిషేకం...

## - చక్రస్నానంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

**సూర్య కోరుట్ల**

కోరుట్ల పట్టణం ఆదర్శనగర్‌లో ఉన్న శ్రీ అష్టలక్ష్మి సహిత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో సప్తమ దశ వార్షికోత్సవ పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా ముగిశాయి. బ్రహ్మోత్సవాల చివరి రోజైన బుధవారం అష్టోత్తర శత కలశ పూజ, సుదర్శన చక్రస్నానం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. యజ్ఞాచార్యులు సముద్రాల శ్రీరామాచార్యులు వైదిక విధానంలో వేద మంత్రోచ్చారణల మధ్య అష్టోత్తర శత కలశ పూజ నిర్వహించారు. అనంతరం శ్రీ అష్టలక్ష్మి



సహిత శ్రీ లక్ష్మీనారాయణ స్వామివారికి, అమ్మవార్లకు 108 కలశాలతో మహాభిషేకం నిర్వహించగా, ఆలయం అంతటా భక్తి గానాలు మార్మోగాయి. ప్రత్యేక అలంకరణలో స్వామివారి దర్శనం భక్తులను ఆహ్లాదపరిచింది. తదుపరి ఆలయ ప్రాంగణంలోని కోనేరులో సుదర్శన భగవానునికి చక్రస్నానం నిర్వహించారు. అర్చకులు, భక్తులు కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి కృపాకటాక్షాలు కోరుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, అర్చకులు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేశారు.

### శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం చూతము రారండి..

**సూర్య రామడుగు**



రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ నార్ల రమేష్ తెలిపారు. ఉదయం 9 గంటలకు 1000 మంది స్త్రీమూర్తులచే కుంకుమ పూజ నిర్వహించబడును. ఈ కళ్యాణం ఉత్సవానికి గోపాలరావుపేట గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కళ్యాణ ఉత్సవం విజయవంతం చేయాలని కోరారు. ఈ కళ్యాణ ఉత్సవానికి అర్చకులు డింగరిసత్యనారాయణ చార్యులు యగ్నికులు మురలీధర ఆచార్యులు దుర్శేటి కిరణ్ కుమార్ డింగరి రమణాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం జరుగుతుందని చైర్మన్ తెలిపారు.

రెండు రోజులైనా ఆచూకీ దొరకని బుర్ర సునీల్..
కెనాల్ వెంబడి వెతికిన దొరకని వైనం.

## సునీల్ మిస్సింగ్ పై పోలీసులకు ఫిర్యాదు చేసిన తండ్రి రాజేశం.

### - క్రికెట్ ఆట వివాదమే కారణమా?.. మోలుగూరీ రాజు పై చర్య తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు.

### - సునీల్ మిస్సింగ్ పై పలు అనుమానాలు!..

**సూర్య రామడుగు**



రామడుగు మండలం చిప్పకుర్తి గ్రామానికి చెందిన బుర్ర సునీల్ 24 అనే యువకుడు గాయత్రి వరద కాలువ కెనాల్లో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సునీల్ అన్న అజయ్ కి ఫోన్ ద్వారా తెలిపిన విషయం విధితమే.. వివరాలలోకి వెళితే చిప్పకుర్తి సమీపంలోని గాయత్రి కెనాల్ పక్కన ఉన్న స్థలంలో గ్రామానికి చెందిన కొంతమంది యువకులు గత రెండు రోజుల నుండి క్రికెట్ ఆట ఆడుతున్నారు. ఈ క్రమంలో బుర్ర సునీల్ 24 అనే యువకుడ్ని క్రికెట్ ఆట ఆడుతానని యువకులనుఅడగగా దీంతో క్రికెట్ ఆట ఆడేందుకు ఆ యువకులు విముఖత వ్యక్తం చేయడంతో.. దీంతో సునీల్ కు ఆ యువకులకు కొంత వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ విషయం గ్రామ ప్రజాప్రతినిధి దృష్టికి రాజేశం కుమారులు బుర్ర అజయ్ బుర్ర సునీల్ ఇద్దరు తీసుకువెళ్లారు. అనంతరం ఆ యువకుల ముందు అడగగా మళ్లీ తీవ్రస్థాయిలో రాజు అనే వ్యక్తి ఇద్దరు కుమారులను బూతులు తిడుతూ చితక బాదాడని సునీల్ తండ్రి బుర్ర రాజేశం పోలీసులకు బుధవారంఫిర్యాదు చేశారు. తన రెండవ కుమారుడైన సునీల్ కెనాల్ లో దూకి ఆత్మహత్య చేసుకుంటానని పెద్ద కుమారుడు అజయ్ కి ఫోన్ చేసి రాజు అనే వ్యక్తి బూతులు తిట్టి చితకబాధడంతోనే మనస్థాపానికి గురవుతున్నారని వెంటనే కెనాల్ లో దూకుతున్నానని చెప్పాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులు పేర్కొన్నాడు. సునీల్ బుధవారం మధ్యాహ్నం మిస్సింగ్ కాగా గురువారం రాత్రి వరకు కూడా గాయత్రి వరద కాలువలోఎలాంటి ఆచూకీ లభించలేదు

## కొడిమ్యాలలో రంగుల హోలీ సంబరాలు

**సూర్య కొడిమ్యాల**

కొడిమ్యాల గ్రామంలో హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో సర్పంచ్ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో యువత హోలీ సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. రంగుల పండుగగా పేరుగాంచిన హోలీ సందర్భంగా యువకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరికి ఒకరు రంగులు చల్లి ఆనందాన్ని పంచుకున్నారు. స్నేహభావం, ఐక్యతకు ప్రతీకగా హోలీ పండుగను జరుపుకోవడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా సర్పంచ్ జీవన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ ఐక్యంగా ఉండాలని, పండుగలను సామరస్య వాతావరణంలో జరుపుకోవడం ఆనందదాయకమని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

## లైన్ మెన్ దినోత్సవం...అందరికి సన్మానం

### - వినియోగదారులకు సేవలు అందించాలి - ఏఈ కోరండ్ల

**సూర్య, సెంటినరీ కాలనీ**

విద్యుత్ సంస్థలో లైన్ మెన్ దినోత్సవం సందర్భంగా బుధవారం రామగిరి మండలం రత్నాపూర్ సబ్ స్టేషన్ లోని సెక్షన్ ఆఫీస్ లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామగిరి విద్యుత్ ఏఈ కోరండ్ల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులకు సేవలు అందించడమే మన ప్రథమ కర్తవ్యం అన్నారు. ప్రభుత్వం, ఎన్పీడీసీఎల్ సంస్థ గ్రామాలలో లో వోల్టేజ్ సమస్య లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తుందన్నారు. ఈ సందర్భంగా రామగిరి పరిధిలోని ఉద్యోగులందరినీ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ కుమ్మరికుంట సతీష్,సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ ఉడుత భూమయ్య, నవీన్ కుమార్, లైన్ మెన్ లు బంగారి శివ కుమార్, ఆకుల శ్రీనివాస్, వడ్లకొండ రమేష్, రాజేందర్, ఏఎల్ఏం లు తిప్పిరిశెట్టి రమేష్, ఈశ్వరోజు ప్రభాకర్, కందుల అంజయ్య, కృష్ణమాచారి, బండి శ్రీనివాస్, రాకేష్ వర్మ, జె.రాజ్ కుమార్, ఆపరేటర్ లు గుజ్జుల శ్రీనివాస్, వీరగోని రాజశేఖర్, ఆన్ మ్యాన్ లు గుండ చందు, వేగోళపు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ లకు ఖాకీ యూనిఫాం అందచేయాలి

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థ భూపాలపల్లి డివిజన్ లో పనిచేసే ప్రైవేట్ సెక్యూరిటీ కార్మికులకు యాజమాన్యం ఖాకీ యూనిఫాం ఇవ్వాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థలో ప్రైవేటు సెక్యూరిటీ కార్మికులకు వివిధ కాంట్రాక్టర్స్ మారినప్పుడు వారి యొక్క డ్రెస్ కోడ్ తో రకరకాల యూనిఫామ్ ఇవ్వడం జరుగుతుందని, దీనివల్ల కాంట్రాక్టు కార్మికులు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు విధి నిర్వహణలో దొంగలు కూడా వారిని చూసి భయపడే పరిస్థితి లేదని తెలిపారు. కాబట్టి ఈ కార్మికులకు ఖాకి యూనిఫామ్ అందరికీ అమలయ్యే విధంగా సింగరేణి యాజమాన్యం ఒక నిర్ణయం తీసుకొని ఈ కార్మికులందరికీ ఖాకీ యూనిఫాం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మారం రామ్ రెడ్డి, మేకల సతీష్, జిట్టవేణి శంకర్, జోరు నరేష్, జిట్టవేణి సదయ్య, కే.కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసిన కౌన్సిలర్ బత్తుల నరేష్

**సూర్య మెట్‌పల్లి:-**

పట్టణ మూడవ వార్డు కౌన్సిలర్ బత్తుల నరేష్ రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామిని బుధవారం కలిశారు. కౌన్సిలర్‌గా విజయం సాధించిన తర్వాత మొదటిసారి హైదరాబాద్ లోని మంత్రి కార్యాలయానికి వెళ్లిన ఆయన, మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్ గా ఎన్నికైన నరేష్ కు మంత్రి వివేక్ వెంకటస్వామి శుభాకాంక్షలు తెలిపారు.



## హోలీ వేడుకల్లో కోరుట్ల ఐఎంఏ వైద్యులు

**సూర్య కోరుట్ల**

హోలీ పండుగ సందర్భంగా కోరుట్ల పట్టణంలో వైద్యులు ఆనందోత్సాహాలతో వేడుకలు నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) కోరుట్ల శాఖ ఆధ్వర్యంలో ఐఎంఏ హాల్లో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని రంగులు చల్లి పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ వై. అనుప్ రావు, ఐఎంఏ అధ్యక్షులు రేగొండ రాజేష్, కార్యదర్శి కటుకం జగదీశ్వర్, ఖజాంచి గంద్ర అన్వేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రవి కిరణ్, మనోజ్, ఇంద్రనీల్, రమేష్, నరేష్, రాజేందర్, రాజేష్, లక్ష్మీపతి, సంతోష్, రఘుపతి తదితర వైద్యులు హాజరయ్యారు. మహిళా వైద్య నిపుణులు స్వీటీ, అనురాధ, జోష్ణ, ప్రియాంక, గీత, శృతి, దీప్తి, విజయశ్రీ తదితరులు పాల్గొని వేడుకలకు మరింత శోభను చేకూర్చారు.



## బ్రహ్మోత్సవాల విజయంపై సర్పంచ్ కృతజ్ఞతలు

**సూర్య కొడిమ్యాల**

కొడిమ్యాల మండలం నమిలికొండ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామ సర్పంచ్ షాబుద్దీన్ మాట్లాడుతూ... నమిలికొండ గుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని సర్పంచ్ షాబుద్దీన్ అన్నారు. ఉత్సవాల నిర్వహణలో గ్రామ పెద్దలు, యువత, మహిళలు, వాలంటీర్లు సమిష్టిగా కృషి చేసి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారని పేర్కొన్నారు. శోభాయాత్ర, పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవం, జాతర మరియు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు సజావుగా జరగడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, దాతలు అందించిన సహకారం మరువలేనిదని ఆయన అన్నారు. దూరదూర ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామ ఐక్యతను మరింత బలపరుస్తాయని, భవిష్యత్తులో కూడా అందరి సహకారంతో మరింత వైభవంగా ఉత్సవాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ షాబుద్దీన్ స్పష్టం చేశారు

## రేచపల్లి లో తప్పిపోయిన బాలుడు.

**సూర్య సారంగాపూర్**



సారంగాపూర్ మండలంలోని రేచపల్లి గ్రామంలో మంగళ వారం బాలుడు తప్పిపోయినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన చెన్నోజి రమేష్ జ్యోస్న దంపతుల రెండవ కుమారుడు పవన్ తేజ హోలీ ఆడుకోవడానికి ఉదయం 10 గంటలకు ఇంట్ల నుండి బయటకు వెళ్ళాడు. సాయంత్రమైన పవన్ తేజ ఇంటికి రాకపోవటంతో కంగారుపడిన తల్లిదండ్రులు, గ్రామస్తులు ఇంటి చుట్టూ పక్కలతో పాటు రాత్రి వరకు ఎంత వెతికిన కనపడకపోవటంతో బుధవారం స్థానిక పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేసినట్లు ఎస్ఐ గీత తెలిపారు. బాలుడు ఇంటి నుండి వెళ్లేటప్పుడు పింక్ రంగు టీ షర్ట్ ధరించినీలం రంగు సైకిల్ పట్టుకొని పోయినట్లు పేర్కొన్నారు. ఎత్తు 3.5 ఫీట్లు, చామన ఛాయ రంగులో కలదు. ఎవరికైనా బాలుడు కనిపిస్తే సారంగాపూర్ పోలీస్ లకు తెలపాలని ఎస్సై పాకాల గీత సూచించారు.

# లింగ నిర్ధారణ చేస్తే చర్యలు...

## - డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి - ప్రైవేట్ ఆస్పత్రులు స్కానింగ్ సెంటర్‌ల ఆకస్మిక తనిఖీ

**సూర్య మెట్‌పల్లి**

పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను, స్కానింగ్ సెంటర్లను డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలని అతిక్రమించిన వారిపై క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, పి సి పి ఎన్ డి టి యాక్టుల ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించిన డాక్టర్ల ద్వారా నే వైద్య సేవలు అందించాలని, కొత్తగా ఎవరైనా వచ్చినట్లయితే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల లో ఆడిషన్ చేశాకే వారి సేవలు వినియోగించుకోవాలని తెలిపారు.గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధిత చట్టం 1994 ప్రకారం లింగ నిర్ధారణ చేసి ఆడ,మగ అని చెప్పడం చట్టరీత్యా నేరమని మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి పేర్కొన్నారు.



స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ మిషన్స్ మరియు డాక్టర్ల అర్హత ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకున్న విధంగానే ఉన్నాయా అని నిర్ధారించుకున్నారు. ఫారం ఎఫ్ లు ప్రతినెల 5వ తారీఖు లోపు వారికి కేటాయించబడిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలలో సబ్మిట్ చేయవలసిందిగా ఆదేశించారు. ఫారం ఎఫ్ లు ఆన్ లైన్, ఆఫ్ లైన్ లో ఒకే విధంగా ఉండాలన్నారు. లింగ నిర్ధారణ చేసేటప్పుడు పేషంట్లకు కనపడే విధంగా ఇక్కడ లింగ నిర్ధారణ చేయబడదు - లింగ నిర్ధారణ చేసినచో కఠిన చర్యలు తీసుకోబడతాయి అని ఫ్లెక్సీ బోర్డులు , ఫోం బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నిబంధనలు అతిక్రమించి లింగ నిర్ధారణ చేసినచో జరిమానా విధించబడడమే కాకుండా గర్భిణీ మినహా ప్రోత్సహించిన వారి కి కూడా జరిమానా మూడు నెలల జైలు శిక్ష ఉంటుందని, వైద్యుల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించిన వారికి నోటీసులు జారీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ తరాల శంకర్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## నాగపెల్లి లక్ష్మీ నరసింహుడిని దర్శించున్న మంత్రి అడ్లూరి

**సూర్య వెల్గటూర్**



జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కిషన్రావుపేట గ్రామంలోని స్వయంభూగా వెలసిన శ్రీనాగపెల్లి లక్ష్మి నరసింహుడి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టంమైన రథోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సి,ఎస్టీ, మైనారిటీ, దివ్యంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం హాజరయ్యారు.ఆలయ కమిటీ చైర్మన్ నైనాల అజయ్,సర్పంచ్ కుమ్మరి సునీత-వెంకటేష్, అర్చకులు మంత్రి అడ్లూరికి పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి అడ్లూరి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తటిపర్తి శైలేందర్ రెడ్డి,నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి స్వామివారి దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం చేసి స్వామి వారి చిత్రపటాన్ని అందించి,శాలువాల తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నైనాల అజయ్,సర్పంచ్ కుమ్మరి సునీత-వెంకటేష్,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తటిపర్తి శైలేందర్ రెడ్డి,మద్దుల గోపాల్ రెడ్డి, కోటిలింగాల ఆలయ కమిటీ చైర్మన్ పూదరి రమేష్,తరాల శివకుమార్, పాదం వెంకటేష్, మేరుగు నరేష్ గౌడ్,మాజీ సర్పంచ్ మేరుగు మురళీ గౌడ్, బందెల ఉదయ్ గౌడ్,ఉపసర్పంచ్ గంద్ర ప్రతాప్ రావు,బోగే ప్రేమసాగర్, సర్పంచ్ మహేందర్ రెడ్డి, గుమ్ముల అజయ్,అన్నమానేని గజేందర్ రావు,గుమ్ముల అజయ్,సంకోజి శ్రీనివాస్,నీలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పాలకవర్గానికి అయ్యప్ప ఆలయంలో సన్మానం

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



అయ్యప్ప స్వామి శక్తి స్వరూపుడని ఆయన ఆశీస్సులు మా మున్సిపల్ పాలకవర్గానికి ఎల్లప్పుడూ ఉండాలని జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ కోరారు.జగిత్యాల అయ్యప్ప ఆలయంలో బుధవారం జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి-శ్రీనివాస్ దంపతులు, పట్టణ వార్డ్ కౌన్సిలర్లు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అయ్యప్ప సేవా ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో వేద బ్రాహ్మనోత్తముల ఆశీర్వచనాలతో వారిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా చైర్పర్సన్ వాణి మాట్లాడుతూ ఆలయంలోకి రాగానే మాకు గొప్ప శక్తి వచ్చినట్లయిందని, ఆశక్తి అయ్యప్ప స్వామి అని పేర్కొన్నారు.ఆలయంలో ప్రశాంతత, ఆనందం పొందామని తెలిపారు.అయ్యప్ప స్వామి ఆశీస్సులతో జగిత్యాల పట్టణ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, జగిత్యాల మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చెందాలని, అందుకు అయ్యప్పస్వామి దీవెనలు మాకు ఉండాలని వాణి వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ వాణి తో పాటు కౌన్సిలర్లు బోయినిపెల్లి ప్రశాంత్ రావు, కోరుకంటి రామ్, వారణాసి మల్లవ్వ తిరుమలయ్య, ఆరవ లక్ష్మి రాజు, మానపురి పవిత్ర మహేష్, అల్లాల సరిత రమేష్ రావు,గాజుల లావణ్య మహేష్,దయ్యాల చంద్రకళ శంకర్, బైర్నేని భాగ్య, కొండా రమ లక్ష్మణ్,మమత రామకృష్ణ రెడ్డి, పిట్ట ధర్మరాజు, క్యాదాసు నవీన్,సీనియర్ గురు స్వాములు బండారి లక్ష్మీనారాయణ, నీలం దశరథ రెడ్డి, మానాల కిషన్, దిటి సతీష్, మార కైలాసం, శ్రీనివాస్, సంకోజీ వెంకట రమణ, పాంపట్టి రవీందర్, పూజారి లక్ష్మీపతి, అయ్యప్ప సేవా ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం చేసిన ప్రగతి యాజమాన్యం దంపతులు

**సూర్య,రాయికల్**



రాయికల్ పట్టణ కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాల అధినేత బాలె జయశ్రీ-శేఖర్ దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని సేవా కార్యక్రమంగా నిర్వహిస్తూ నివేదిత వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు.ఈ సందర్భంగా వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి పండ్లను పంపిణీ చేశారు. వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆశీస్సులు స్వీకరించారు.అనంతరం పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినిలు వృద్ధులతో కలిసి హోలీ వేడుకలను ఆనందంగా నిర్వహించారు.రంగుల సందడి మధ్య విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించగా, వృద్ధులు సంతోషంగా పాల్గొన్నారు.ఈ వేడుకలతో ఆశ్రమం ఆనందోత్సాహాలతో కళకళలాడింది.ఈ సందర్భంగా ప్రగతి పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్ మాట్లాడుతూ, వివాహ వార్షికోత్సవాన్ని వృద్ధుల మధ్య నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, సమాజానికి సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత. పెద్దల ఆశీస్సులు జీవితంలో మరింత స్ఫూర్తినిస్తాయని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తాము అని తెలిపారు.వృద్ధులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని పెంపొందిస్తాయని, యువతలో సేవాభావాన్ని పెంచే విధంగా ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్,ఉపాధ్యాయులు స్వామి, గోపాల్ రెడ్డి,రమ్య,శ్రీలక్ష్మి,సమాజ సేవకులు ఎనుగందుల రమేష్,నివేదిత వృద్ధాశ్రమ పర్యవేక్షకుడు మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వివేకవర్ధిని పాఠశాలలో ఘనంగా స్పోర్ట్స్ మీట్

**సూర్య,రాయికల్**



రాయికల్ పట్టణం లోని వివేకవర్ధిని పాఠశాలలో స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో,రాష్ట్ర స్థాయిలో క్రీడ పోటీలో పాల్గొన్న విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు టార్చ్ బేరర్ ను అందజేసి వెలిగించారు.ఈ క్రీడ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు,తహసీల్దార్ నాగార్జున,రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీంధర్ హాజరై మాట్లాడుతూ ఆటలతో మానసిక ఉల్లాసం దొరుకుతుందని,చదువులో,ఆటలలో ముందులో ఉండాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ వైస్ చైర్మన్ తురగ సౌజన్య శ్రీధర్ రెడ్డి, కౌన్సిలర్స్ పుర్రె శ్రీధర్,మచ్చ గంగ లక్ష్మీ, ఎలిగేటి లతిక అనిల్ కుమార్,భూక్య రాకేష్ నాయక్, కల్లెడ చిన్న ధర్మపురి,పద్మశాలి సేవా సంఘం ఉపాధ్యక్షులు దాసరి గంగాధర్,అడ్వకేట్ మచ్చ శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కైరం సత్యం, ఉపాధ్యాయులు మోర విజయ్, ఉపేందర్,కుందారపు శ్రీనివాస్,వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో పట్టణ అభివృద్ధి సాధిస్తాము

**సూర్య,రాయికల్**



అందరి సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని మున్సిపల్ చైర్మన్ కటుకం రవీందర్ అన్నారు. పీఆర్టీయు టిఎస్ రాయికల్ మండల శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ కటుకం రవీందర్,వైస్ చైర్మన్ సౌజన్య శ్రీధర్ రెడ్డి,కౌన్సిలర్ ఎలిగేటి లతిక అనిల్ ను బుధవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి లో ఉపాధ్యాయులు భాగస్వామ్యులు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పీఆర్టీయు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పొన్నం రమేష్, రాష్ట్ర కార్యదర్సులు గాజంగి రాజేశం, లక్కడి రాజరెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కన్నావేని మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి దొంతి సతీష్, మండల శాఖ అధ్యక్షులు అంటాడుపుల గంగారాజం, ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య, మండల అసోసియేట్ అధ్యక్షులు కడుకుంట్ల అభయ్ రాజ్, కార్యదర్శి సిలివేరి రమేష్, ఊసకోల రాము, మాచర్ల మహేష్,బెజ్జంకి హరికృష్ణ,బూరుగు శ్రీకాంత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## సంజీవ్ నగర్ లో సమస్యలు పరిశీలించిన సర్పంచ్ పల్లె ప్రతిమ

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సంజీవ్ నగర్ లో సమస్యలను బుధవారం స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు పరిశీలించారు. తాగునీటి బావి చుట్టూ ఫెన్సింగ్ వేయాలని, వాటర్ ట్యాంక్ చుట్టూ మట్టి పోయిం చాలని, డ్రైనేజీ సమస్యలు పరిష్క రించాలని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యురాలు కండె లక్ష్మీ గట్టయ్య, కండే సాహితీ పోశం, స్థానిక నాయకురాలు బెజ్జాల భవాని తిరుపతి, పంచాయతీ సెక్రటరీ గంగుల సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా లిటిల్ మాస్టర్స్ స్కూల్ లో హోలీ వేడుకలు

**సూర్య, సెంటినరీ కాలనీ 06 :**



లిటిల్ మాస్టర్స్ స్కూల్ లో ఘనంగా హోలీ పండుగ వేడుకలను నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థి, విద్యార్థులు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సవాల మధ్య నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జంగిలి మల్లేష్ మాట్లాడుతూ విద్యార్థుల యొక్క జీవితాలు కూడా కలర్ ఫుల్ గా సాగాలని కొనియాడారు. అనంతరం విద్యార్థి, విద్యార్థులు ఒకరికొకరు రంగులు పూసుకుని ఆనందాన్ని పంచుకున్నారు. మనలో ఉన్నటువంటి అహాన్ని విడనాడి సంతోషమైన జీవితాలను పాల్గొన్నారు.

# స్వయంభుగా వెలసిన లక్ష్మి నరసింహ స్వామి

**- భక్తులకు మహాఅన్న ప్రసాదం ఏర్పాటు**
**- ఆలయ అభివృద్ధికి భక్తులు సహకరించాలన్న చైర్మన్ కొలిపాక వేణు**

**సూర్య చిగురుమామిడి**

చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతరను బుధవారం ఆలయ కమిటీ సభ్యులు కన్నుల పండుగగా నిర్వహించారు. స్వయంభుగా వెలిసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి భక్తులు సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ కొలిపాక వేణు తెలిపారు. ఉదయం నుండి ఆలయంలో స్వామివారికి అర్చకులు వెంకటేశ్వర స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కలు చెల్లించుకున్నారు. గ్రామానికి చెందిన బిల్లా ప్రభాకర్ రెడ్డి,బిల్లా జైపాల్ రెడ్డి,అయిరెడ్డి భాస్కర్ రెడ్డిలు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి తప్పకుండా చేస్తామని,మన గ్రామంలో శ్రీలక్ష్మి నరసింహ స్వామి వెలసి ఉండటం చాలా అదృష్టమని బిల్లా జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు తెలిపారు. భక్తుల సహకారం తోనే ఆలయ అభివృద్ధి సాధ్యమవుతుందని



సహకరించాలని వేణు కోరారు. ఈ జాతరలో హుస్నాబాద్ మార్కెట్ కమిటి చైర్మన్ కంది తిరుపతి రెడ్డి,ఎంపీడీఓ విజయ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ స్వరూప రాణి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరకు విచ్చేసిన భక్తులకు మహా అన్నప్రసాదాన్ని పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. సాయంత్రం లక్ష్మీ నరసింహ స్వామి గుట్ట చుట్టూ గిరి ప్రదక్షణ కార్యక్రమం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో చాడ శ్రీధర్ రెడ్డి,పూదరి వేణుగోపాల్ గౌడ్,పెనుకుల తిరుపతి,బెజ్జంకి రాంబాబు,కౌటాం అంజయ్య, వెలిమల ఇంద్రసేన రావు,గ్రామపంచాయతీ కార్యదర్శి గోదారి అజయ్ మౌనిక,ఆలయ కమిటీ జనరల్ సెక్రెటరీ కాసాని సతీష్,కార్యదర్శి అరిగేలా రమేష్, ఉపసర్పంచ్ బిల్లా సంతోష్ రెడ్డి,కార్యవర్గ సభ్యులు మామిడి అంజయ్య, పరకాల కొండయ్య, పంకర్ల రాజు యాదవ్, బోయిని సంజు,చాడ అనిల్ రెడ్డి,బిల్లా తిరుపతి రెడ్డి, అన్న సదానందం, నెల్లి శంకర్,తంగనపల్లి అంజయ్య,గాజువాక రవీందర్, కారంపూడి వెంకటేశం,ఈశ్వర్ సమ్మయ్య,చెంచాల నాగరాజు, విలాసాగరం అంజయ్య,తదితరులు పాల్గొన్నారు.



**శ్రీ గట్టు మల్లికార్జున స్వామి గంగ స్నానం, గంగపట్నం**

# వచ్చే ఐదు సం.ల వరకు అయ్యే ఖర్చులన్నీ నేనే భరిస్తా

**- మార్చి 15న జరిగే జాతరను విజయవంతం చేయండి - మల్లన్నపల్లి గ్రామ సర్పంచ్ పసునూటి శ్రీనివాస్**

**సూర్య, ఇల్లందకుంట**

ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి - మల్లన్నపల్లి గ్రామంలో స్వయంభుగా వెలిసిన శ్రీ గట్టు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవ విగ్రహాలకు జరిపే గంగ స్నానం గంగ పట్నం కార్యక్రమాలకు సంబంధించిన వచ్చే ఐదు సం.ల వరకు అయ్యే ఖర్చులన్నీ నేనే భరిస్తానని మల్లన్నపల్లి గ్రామ సర్పంచ్ పసునూటి శ్రీనివాస్ తెలియజేశారు. శ్రీ గట్టు మల్లన్న స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల భాగంలో జరిపే గంగ స్నానం మహోత్సవం ఎంతో విశిష్టమైనదని, ఈ పవిత్ర స్నానానికి స్వామివారి ఉత్సవ విగ్రహాలను తీసుకుని భక్తుల పవిత్ర క్షేత్రమైన కాళేశ్వరంనకు బయలుదేరడం అనాదిగా కొనసాగుతున్న ఆనవాయితీ అని, గంగ స్నానం ద్వారా గ్రామానికి శాంతి, సౌభాగ్యం, సస్యశ్యామలం



కలుగుతాయని భక్తుల విశ్వాసం అని అన్నారు. ఈ పుణ్యయాత్రలో పాల్గొనే భక్తుల రవాణా భోజన ఖర్చులను మల్లన్నపల్లి గ్రామ సర్పంచ్ పసునూటి శ్రీనివాస్ దాతృత్వంతో భరించడం అభినందనీయమని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సుల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, అన్నదానం, విశ్రాంతి ఏర్పాట్లు వంటి అన్ని విధాలా సదుపాయాలు కల్పించినందుకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా శ్రీ గట్టు మల్లికార్జున స్వామి దేవస్థానం అభివృద్ధికి అన్నివేళలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రాచపల్లి - మల్లన్నపల్లి గ్రామంలోని భక్తులు తమకు తోచిన విధంగా తమ వంతు సహాయాన్ని స్వామివారికి అందిస్తూ మార్చి 15న జరిగే జాతరలో తాము భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

## పీఎం - సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ప్రచార రథం ప్రారంభం

**సూర్య జగిత్యాల ప్రతినిధి**




దేశంలో ఒక కోటి కుటుంబాలకు లబ్ది చేకూర్చడానికి, పీఎం - సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా ప్రతీ విద్యుత్ వినియోగదారుడు తమ ఇళ్ల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని, కర్బన ఉద్గారాలు జీరో స్థాయికి తేవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కల్పించడానికి ఉద్దేశించిన ప్రచార రథాన్ని కలెక్టర్ జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్కో జిల్లా మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ 3 కిలోవాట్ల పలకలు ఏర్పాటు చేసుకొంటే కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడీ అందిస్తుందని, దాంతో పాటు ప్రతీ నెలా రూ.2 వేల విద్యుత్ బిల్లు అదా చేయవచ్చని తెలిపారు. పెట్టుబడి ఆరు సంవత్సరాల్లో తిరిగి వస్తుందని అన్నారు. సోలార్ విద్యుత్ పర్యావరణ హితమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల డీఈ గంగారాం, ఏడీఈ జవహర్ నాయక్, ఎన్పీడీసీఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మళ్ళీ దొరకని బాల్య అనుభవాలు

**- ఉత్సాహంగా 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం**
**- 100శాతం ఉత్తీర్ణత సాధించాలన్న హెచ్ఎం లక్ష్మణరావు..**

**సూర్య చిగురుమామిడి**



చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వార్షిక పరీక్షలు రాయబోయే విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ 5సంవత్సరాలు ఉపాధ్యాయులతో,తోటి విద్యార్థులతో అనుబంధం,తమ అనుభవాలను విద్యార్థులు పంచుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు నెల రోజులు మొబైల్, సోషల్ మీడియా వాడవద్దని ఇచ్చిన సమయంలో పరీక్షలు పూర్తిగా రాయడం ప్రాక్టీస్ చేసుకోవాలని పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకోవాలని చెప్పారు. ఆరోగ్యంగా ఉండి పరీక్షలు మంచిగా రాసి మంచి మార్కులు తెచ్చుకొని తల్లిదండ్రులకు,గురువులకు,ఊరికి మంచి పేరు తేవాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పదో తరగతి విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందిస్తూ,వారు భవిష్యత్తులో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ సన్మానం చేస్తారు. విద్యార్థులు తమ అనుభవాలను, ఉపాధ్యాయుల కృషిని,స్నేహితులతో గడిపిన క్షణాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,గ్రామస్తులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వైభవంగా ఉగ్ర నరసింహస్వామి తెప్పోత్సవం, డోలోత్సవం

**సూర్య ధర్మపురి**

జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలో జరుగుతున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం శ్రీ ఉగ్ర నరసింహస్వామి తెప్పోత్సవ, డోలోత్సవ కార్యక్రమాన్ని దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, దేవస్థానం కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నాలుగు గంటల నుండి ఆలయంలో స్వామివారికి అభిషేకం, అర్చన తదితర కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం దేవస్థానం నుండి బయలుదేరిన స్వామి వారి సేవ మంగళ వాయిద్యముల మధ్య మంగళ హారతులతో మహిళలు వెంట రాగా బ్రహ్మ పుష్కరిణి (కోనేరు) లో ప్రత్యేకంగా పూలతో అలంకరణ చేసిన హంస వాహనంపై ఆసీనులను బ్రహ్మ పుష్కరిణిలో ఐదు ప్రదక్షిణలు చేయించారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామివారిపై బుక్క గులాలు చల్లి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భోగమండపంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఊయలలో స్వామివారిని ఆసీనులను చేసి డోలోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు క్యూ లైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు చేస్తున్న గోవింద గోవిందా నామస్మరణలతో బ్రహ్మ పుష్కరిణి పులకించిపోయింది. అనంతరం స్వామివారి సేవను తిరిగి దేవస్థానమునకు తీసుకువెళ్లారు. క్షేత్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి దేవాలయ 27 వ వార్షికోత్సవ వేడుకలు

**సూర్య జమ్మికుంట**



అపర శబరిమలగా క్యాతినొందిన జమ్మికుంట శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ 27 వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా జరుపుకున్నారు వందల మంది భక్తులు పాల్గొనగా ఉదయం నుండి ఆలయంలో సుప్రభాతం, గణపతి పూజ, పుణ్యాహ వాచనం, సర్వతో మండపారాధన జరిగింది. అనంతరం అష్టోత్తర కలశ పూజ, గణపతి హోమం, నవగ్రహ రుద్ర హోమం, జయాది హోమం, బలిహరణ మహాపూర్ణాహుతి నిర్వహించారు. అయ్యప్ప స్వామి వారికి అష్టోత్తర కలశ ఘటాభిషేకం విశేషమైన ద్రవ్యముల చేత అష్టాభిషేకం జరిపించారు. ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాస శర్మ సహాయ అర్చకుడు ప్రేమ్ నారాయణ్ మిశ్రా ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించగా ఆలయ చైర్మన్ సిరిమల్లె జయేందర్ మామిడాల మనోహర్ జగదీశ్వర్ వీర్రాజు ప్రతాపరెడ్డి వెంకట్ రెడ్డి ప్రభాకర్ రావు సదానందం ఒగ్గు రమేష్ రావుల శ్రీనివాస్ మురళి దామోదర్ కమిటీ సభ్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం

**- నియోజకవర్గం లో 3500ఇండ్లు మంజూరు**
**- నిరుపేదల సొంతింటి కల నెరవేరుస్తాం**

**సూర్య గంగాధర**



చొప్పదండి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొ న్నారు. గంగాధర మండలం ర్యాలపల్లి గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు బొజ్జ సునీత తిరుపతి దంపుతుల గృహప్రవేశం కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరైనారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు సునీత దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో చొప్పదండి నియోజకవర్గం లో రెండేళ్లలోనే అర్హులైన లబ్ధిదారులకు 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది కి ఇందిరమ్మ ఇండ్లను అందజేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. చొప్ప దండి నియోజకవర్గం లో నిరుపేదల సొంటింటి కలను నిజం చేస్తామని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో నిరుపేదల కోసం ఒక్కటంటే ఒక్కటి కూడా కట్టించలేదని గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో నాటి కెసిఆర్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇండ్లు రాణి నిరుపేదలు ఆందోళన చెందవద్దని, రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో దమ్మని రాము, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.